
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
కృష్ణా జిల్లా వార్తలు
గురువారం 5 డిసెంబరు 2024



రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు!

జనవరి 8 వరకు నిరాటంకంగా..

(ఆంధ్ర జ్యోతి, విజయవాడ) : రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నుంచి జిల్లావ్యాప్తంగా సదస్సులు నిర్వహించనున్నారు. భూ సంబంధిత సమస్యలకు పరిష్కార వేదికలుగా ఈ సదస్సులు ఉపయోగపడతాయి. భూములను 22ఏ నుంచి తొలగించడానికి, అన్ని అర్హతలున్నా అడంగల్‌లోకి పేర్లు ఎక్కకపోతే సరిచేయడానికి, భూ రికార్డుల్లో తప్పులు ఉంటే సరిచేయించుకోవటానికి, భూములను ఎవరైనా ఆక్రమిస్తే ఫిర్యాదు చేయడానికి, సదరు ఫిర్యాదులపై బాధితులకు ప్రభుత్వం చట్టపరమైన రక్షణ కల్పించడానికి, కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిపిన రీ సర్వే వల్ల నష్టపోయిన వారికి పరిష్కారం చూపడానికి ఈ సదస్సులు దోహదపడతాయి. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా 320 గ్రామాలు, కృష్ణా జిల్లావ్యాప్తంగా 290 గ్రామాల్లో ఈ సదస్సులు జరుగుతాయి. రెవెన్యూ గ్రామాల ప్రాతిపదికన ఎక్కడెక్కడ, ఎప్పుడెప్పుడు రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్న దానిపై షెడ్యూల్‌ను రూపొందించి గ్రామ సచివాలయాలకు తెలియపరుస్తారు. ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ నగరంతో పాటు నందిగామ, జగ్గయ్యపేట, ఇబ్రహీంపట్నం, తిరువూరులో సదస్సులు జరుగుతాయి. కాగా, శుక్రవారం జగ్గయ్యపేట మండలం తక్కెళ్లపాడులో నిర్వహించే సదస్సులో సీసీఎల్ఏ పాల్గొంటారు. అలాగే, జిల్లాలో జరిగే కొన్ని రెవెన్యూ సదస్సుల్లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కూడా పాల్గొంటారు. స్థానిక ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు కూడా పాల్గొంటారు.

భయకంపం

ఉమ్మడి కృష్ణాజిల్లాలో భూ ప్రకంపనలు
రిక్టర్ స్కేల్‌పై 5.3గా నమోదు
తిరువూరులో ఇంటి గోడలకు బీటలు
హనుమాన్ జంక్షన్‌లోనూ కంపించిన భూమి



తిరువూరులో గోడకు వచ్చిన పగుళ్లు

- సీసీ కెమెరాల్లో స్పష్టంగా తెలిసిన భూకంపం ఆనవాళ్లు
- విజయవాడలోనూ స్వల్పంగా..
- భయంతో పరుగులు తీసిన ప్రజలు
- సాధారణమేనంటున్న శాస్త్రవేత్తలు

2, 3 నెలలో మళ్లీ వచ్చే అవకాశం

విజయవాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో బుధవారం ఉదయం కొద్దిసేపు భూప్రకంపనలు సంభవించాయి. ఉదయం 7.20 గంటల సమయంలో కొద్ది సెకన్ల పాటు ఈ పరిస్థితి తలెత్తింది. తెలంగాణలోని ములుగు జిల్లా కేంద్రంగా భూమి కంపించడంతో దాన్ని భూకంప కేంద్రంగా శాస్త్రవేత్తలు వ్యవహరిస్తున్నారు. భూమి అడుగు భాగం నుంచి 200-300 కిలో మీటర్ల దూరంలో ఈ ప్రకంపనలను గుర్తించారు. ఇది రిక్టర్ స్కేల్‌పై 5.3గా నమోదైంది.

భయాందోళనలో ప్రజలు

జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా దేశాన్ని ఐదు జోన్లుగా విభజించింది. రెండు తెలుగు రాష్ట్రాలు జోన్-2లో ఉన్నాయి. ములుగులో భూమి కంపించిన ప్రభావం ఉమ్మడి కృష్ణాజిల్లాపై పడింది. నందిగామ, జగ్గయ్యపేట, మైలవరంతో పాటు విజయవాడ నగరం, హనుమాన్ జంక్షన్, మచిలీపట్నం, గుడివాడ, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, నందిగామ, కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో ప్రకంపనలు వచ్చాయి. తిరువూరు మండలం రాజుపేటలో ఈ ప్రకంపనలకు మిగతా 6లో..

ఎట్టకేలకు గుడివాడ గడ్డం గ్యాంగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుపై హత్యాయత్నం కేసులో పది మందిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించారు. నిందితులను నెల్లూరు జిల్లా జైలుకు తరలించారు. ప్రధాన నిందితుడు కాళీ పరారీలు ఉన్నాడు. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.



నిందితులను వైద్య పరీక్షల నిమిత్తం గుడివాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తున్న పోలీసులు

గడ్డం గ్యాంగ్ అరెస్టు

2022 డిసెంబరు 25న మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వర రావుపై హత్యాయత్నం

- కర్రలు, పెట్రోలు సంచులతో మాజీ మంత్రి కొడాలి నాని అనుచరుల దాడి
- రావి వెంకటేశ్వరరావుకు రాష్ట్ర స్థాయి పదవి రావడంతో పోలీసుల్లో కదలిక!
- గడ్డం గ్యాంగ్‌లో పది మంది అరెస్టు
- గుడివాడలో న్యాయమూర్తి ఎదుట హాజరు
- 14 రోజుల రిమాండ్
- నెల్లూరు జిల్లా జైలుకు నిందితుల తరలింపు
- పరారీలో ప్రధాన నిందితుడు కాళీ

ఆంధ్రజ్యోతి-గుడివాడ: అప్పటి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుకు 2022 డిసెంబరు 25వ తేదీన మాజీ మంత్రి కొడాలి నాని ముఖ్య అనుచరుడు, గడ్డం గ్యాంగ్ లీడర్, వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దూషిస్తూ.. చంపుతానంటూ బెదిరింపులకు దిగాడు. సదరు విషయాన్ని రావి వెంకటేశ్వరరావు వెంటనే గుడివాడ డీఎస్పీ ఎన్.సత్యానందం, వన్‌టౌన్ సీఐ గోవిందరాజుకు తెలియజేసి రక్షణ కోరారు. పోలీసులు ఈ విషయాన్ని లైట్‌గా తీసుకున్నారు. నామమాత్రంగా టీడీపీ కార్యాలయం వద్ద పోలీసులను పెట్టారు. అన్నట్టుగానే కాళీ తన గడ్డం గ్యాంగ్‌తో టీడీపీ కార్యాలయం వద్దకు పెట్రోలు సంచులు, కర్రలు, కత్తులతో వచ్చి టీడీపీ శ్రేణులపై దాడికి దిగాడు. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావును



గడ్డం గ్యాంగ్ ప్రసాద్‌ను నిలువరిస్తున్న పోలీసులు(ఫైల్)

అంతమొందించడమే లక్ష్యంగా గడ్డం గ్యాంగ్ దారుణానికి ఒడిగట్టింది. పెట్రోలు సంచులను టీడీపీ వర్గీయులపైకి విసిరి బీభత్సం సృష్టించింది. రావికి మద్దతుగా టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి గడ్డం గ్యాంగ్‌ను ప్రతిఘటించడంతోనే రావి ప్రాణాలతో బయటపడ్డారు.

నాడు టీడీపీ శ్రేణులపైనే లాఠీచార్జి

సంఘటనా స్థలంలోనే ఉన్న సీఐ గోవిందరాజు, సిబ్బంది ఈ దుశ్చర్యను నిలువరించడంలో విఫలమయ్యారు. స్వామిభక్తిలో మునిగితేలుతున్న సీఐ గోవిందరాజు దాడికి పాల్పడిన వారిని వదిలి టీడీపీ శ్రేణులపై లాఠీ ఝుళిపించారని అప్పట్లో విమర్శలు వచ్చాయి. పక్కనే నిలబడి ఉన్న ద్విచక్రవాహనదారుడిపై కూడా లాఠీతో విరుచుకుపడటంతో అతను వాహనంపై నుంచి పడి గాయాలపాలైన విషయం తెలిసిందే. గడ్డం గ్యాంగ్‌పై టీడీపీ నాయకులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నామమాత్రంగా కేసు కట్టి చేతులు దులుపుకున్నారు. టీడీపీ నాయకులపై మాత్రం రెండు కేసులు నమోదు చేశారు.

ఇన్నాళ్లు కళ్ల ముందే తిరుగుతున్నా పట్టించుకోలేదు

రాష్ట్రంలో ప్రభుత్వం మారినా గుడివాడ పోలీసుల వ్యవహార శైలిలో మార్పు రాలేదు. మాజీ ఎమ్మెల్యే రావిపై హత్యాయత్నం చేసిన గడ్డం గ్యాంగ్ సభ్యులు గత ఆరు నెలలుగా గుడివాడలో కళ్ల ముందే తిరుగుతున్నా పోలీస్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రధాన నిందితుడు మెరుగుమాల కాళీ ఏలూరు జిల్లా మీర్జాపురం గ్రామంలో తలదాచుకున్నట్లు సమాచారం. రాత్రి వేళ కాళీ గుడివాడ వచ్చి వెళ్తున్నా పోలీసులు నిర్లక్ష్యం వహించారు. ప్రస్తుతం కాళీ అస్సాంలో ఉన్నట్లు పోలీస్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా రాష్ట్రం విడిచి పారిపోయాక పోలీసులు అరెస్టులు ప్రారంభించారని టీడీపీ శ్రేణులు విమర్శిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్యే హోదాలో రావి వెంకటేశ్వరరావు కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకోలేదని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. రావి వెంకటేశ్వరరావు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా నియమితులవ్వడంతో పోలీసుల్లో ఒక్కసారిగా చలనం వచ్చిందని పేర్కొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిన ఈ కేసులో ఆనాడు పోలీసులు వ్యవహరించిన తీరు విస్మయానికి గురి చేసింది. నామమాత్రంగా బెయిలబుల్ కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు ఉన్నాయి.

గడ్డం గ్యాంగ్‌ను సమర్థించిన మాజీ మంత్రి నాని



గడ్డం గ్యాంగ్‌తో మాజీ మంత్రి కొడాలి నాని(ఫైల్)

అధికారంలో ఉండగా మాజీ మంత్రి కొడాలి నాని, ఆయన ముఖ్య అనుచరుడు దుక్కిపాటి శశిభూషణ్ మాటే వేదంగా గడ్డం గ్యాంగ్ పనిచేసింది. ఆ నాడు మాజీ ఎమ్మెల్యే రావిపై హత్యాయత్నానికి ఒడిగట్టిన నాని తన గడ్డం గ్యాంగ్‌ను సమర్థించుకున్నారు. 'రావిని చంపుతా అని బెదిరించిన వాడు నేరుగా కార్యాలయానికే వస్తాడా, జరిగిన దాడికి వైసీపీకి ఎటువంటి సంబంధం లేదని, పార్టీలో యాక్టివ్‌గా ఉన్న వారెవ్వరూ లేరు" అని కొడాలి వ్యాఖ్యానించారు. మరునాడే గడ్డం గ్యాంగ్‌తో నాని దిగిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

పోలీసులు అరెస్టు చేసిన నిందితులు వీరే..

వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసిన వారిలో గడ్డం గ్యాంగ్ సభ్యులు నీరుడు ప్రసాద్, రాపాక పవన్‌కుమార్, మెరుగుమాల ఉదయ్‌కుమార్, కొండ్రు శ్రీకాంత్, నీరుడు భార్గవ్, సుంకర సతీష్, గొంటి అశోక్, రాజ్యబోయిన తాండవ కృష్ణ, గొల్ల వెంకటేశ్వరరావు, పండేటి మోషే ఉన్నారు. వీరిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. నిందితులను నెల్లూరు జిల్లా జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.



- కరెంట్ ఖాతాలే టార్గెట్‌గా.. ప్రత్యేక వ్యవస్థ
- కమీషన్లు ఇచ్చి బయటి వ్యక్తుల పేరిట కొత్త ఖాతాలు
- నేరాల్లో దోచిన సొమ్మంతా ఆ ఖాతాలకే మళ్లింపు
- వివిధ కేసుల దర్యాప్తుల్లో గుర్తించిన పోలీసులు

'ఖాత'ర్నాక్

సైబర్ నేరగాళ్ల నయా మోసం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): సైబర్ నేరగాళ్లు బ్యాంకుల కరెంటు ఖాతాలను విచ్చలవిడిగా ఉపయోగిస్తున్నారు. వివిధ కేసుల్లో దర్యాప్తు చేస్తున్న క్రమంలో బాధితులు జమ చేసిన డబ్బులన్నీ కరెంటు ఖాతాలోనే జమ అవుతున్నట్టు సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు. ఈ తరహా కరెంట్ ఖాతాలు ప్రైవేట్ బ్యాంకుల్లో అధికంగా ఉండటంతో పోలీసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కరెంట్ ఖాతాలే టార్గెట్

బ్యాంకు నిబంధనల ప్రకారం కరెంట్ ఖాతాలు తెరవడానికి కొన్ని నియమాలు ఉంటాయి. ఈ తరహా ఖాతాలను ఎక్కువగా వ్యాపార లావాదేవీలకు వినియోగిస్తారు. ఎవరైనా ఒక వ్యక్తి బ్యాంకుకు వెళ్లి కరెంట్ ఖాతా కావాలని అడిగినప్పుడు అధికారులు పూర్తి వివరాలు తెలుసుకోవాలి. ఏ అవసరాల కోసం ఖాతా తెరవాలనుకుంటున్నారో తెలుసుకోవాలి. నిజంగా ఆ వ్యక్తికి వ్యాపార సంస్థ ఉందో లేదో పరిశీలించాలి. కానీ, ఇవేమీ లేకుండానే ప్రైవేట్ బ్యాంకులు కరెంట్ ఖాతాలు ఇచ్చేస్తున్నాయి. ఇదే సైబర్ నేరగాళ్లకు పెద్ద అవకాశంగా మారింది. ఎలాంటి కేవైసీ లేకుండా ఈ ఖాతాలు తెరుస్తుండటంతో సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారు.

పక్కా ప్లాన్‌తో..

సైబర్ నేరగాళ్లు డాన్లు మాదిరిగా వ్యవహరిస్తున్నారు. వారి ముక్కు ముఖం ఎవరికీ తెలియదు. అజ్ఞాతంలో ఉంటూనే నాలుగు గోడల మధ్యలో మొబైల్ ద్వారా మొత్తం వ్యవహారాన్ని నడిపిస్తారు. ఇందుకోసం అంచెలంచెలుగా వ్యవస్థలను ఏర్పాటు చేసుకుంటారు. తమ ట్రాప్‌లో పడిన వ్యక్తులు డబ్బు జమ చేయాలంటే ఖాతా తప్పనిసరి. ఇలా కొంతమంది నుంచి బ్యాంకుల్లో కరెంట్ ఖాతాలు తెరిపించే బాధ్యతను నిర్వర్తించడానికి ఏజెంట్లను నియమించుకుంటున్నారు. ఈ ఏజెంట్లు పట్టణాలు, నగరాలు, గ్రామాల్లో ఉంటారు. వీరంతా ఆయా ప్రాంతాల్లో ఒక వర్గాన్ని టార్గెట్ చేసుకుని వల వేస్తుంటారు. వారితో కరెంట్ అకౌంట్లు తెరిపిస్తారు. వారికి నమ్మకం కలగడానికి ఒక్కొక్కరికీ ఒక్కో కథ చెబుతుంటారు. కొంతమంది ప్రముఖులు ఆన్‌లైన్‌లో గేమింగ్ ఆడుతున్నారని, దానికి సంబంధించిన డబ్బు ఈ అకౌంట్‌లో జమ చేస్తారని చెప్తారు. ఇలా అకౌంటును ఉపయోగించుకున్నందుకు రూ.కోటికి రూ.లక్ష చొప్పున కమీషన్ ఇస్తామని నమ్మిస్తారు. ఇలా చేసినందుకు ఆ టీం లీడర్‌కు రూ.లక్షకు రూ.30 వేల చొప్పున కమీషన్ ముట్టజెబుతారు. కరెంట్ అకౌంట్ ఓపెన్ చేసే వ్యక్తితో ముందుగా కొత్త సిమ్ నెంబర్ కొనిపిస్తారు. ఆ నెంబర్‌ను కరెంట్ అకౌంట్‌కు లింక్ చేయిస్తారు. తర్వాత ఎస్ఎంఎస్ పేరుతో ఉండే ఏపీకే ఫైల్‌ను అకౌంట్ ఓపెన్ చేసిన వ్యక్తి సెల్‌ఫోన్‌కు పంపుతారు. ఈ ఫైల్ ఓపెన్ చేసి అతని ఫోన్లో ఇన్‌స్టాల్ చేస్తారు. తర్వాత నుంచి ఈ అకౌంట్‌లో జరిగే లావాదేవీలన్నీ రహస్య ప్రదేశంలో ఉండే సైబర్ నేరగాళ్లకు తెలిసిపోతాయి. ఫోన్.. అకౌంట్ ఓపెన్ చేసిన వ్యక్తి చేతిలో ఉన్నప్పటికీ లావాదేవీలన్నీ క్షణాల్లో సైబర్ నేరగాళ్లకు తెలుస్తాయి. ఆ అకౌంట్ మనుగడలో ఉందో లేదో పరిశీలించుకోవడానికి తొలుత రూపాయి, రెండు రూపాయలు జమ చేస్తారు. ఓకే అనుకున్నాక.. వ్యవహారాలను నడిపిస్తారు. అకౌంట్‌లో పడిన మొత్తాన్ని పడినట్టుగా లాగేసుకుంటారు. బాధితులెవరైనా ఫిర్యాదు చేస్తే పోలీసులు ఆ అకౌంట్‌ను స్తంభింపజేస్తారు. ఈలోపు అందులో రూపాయి నిల్వ లేకుండా మొత్తం ఊడ్చేస్తారు. అకౌంట్ ఓపెన్ చేసిన వ్యక్తి నెంబరు అనుసంధానం చేయిస్తే తర్వాత సైబర్ నేరగాళ్లు దాన్ని మార్చేస్తారు. సదరు వ్యక్తి పోలీసులకు చిక్కినా దొరక్కుండా తప్పించుకుంటారు.

అన్ని మ్యూల్ ఖాతాలే

బ్యాంకుల్లో ఖాతాలు రెండు విధాలుగా ఉంటాయి. అందులో ఒకటి సేవింగ్స్ రెండోది కరెంట్ అకౌంట్. బ్యాంకులు భౌతిక పరిశీలన లేకుండా ఈ ఖాతాను తెరుస్తుండటంతో సైబర్ నేరగాళ్లు వాటిని తమకు అనుకూలంగా ఉపయోగిస్తున్నారు. ఈ తరహా ఖాతాలను మ్యూల్ అకౌంట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ మ్యూల్ అకౌంట్లు ప్రతి ప్రైవేట్ బ్యాంకుల్లో ఎక్కువగా ఉన్నట్టు సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు. సైబర్ నేరాల నుంచి తప్పించుకునే విషయంలో అవగాహన పెంచడానికి పోలీసులు వరుసగా సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఖాతాదారులు భారీ మొత్తంలో వేరే ఖాతాల్లో డబ్బు జమచేస్తే వివరాలు తెలుసుకోవాలని పలుమార్లు పోలీసులు బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు. అయినా బ్యాంకర్లలో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో కరెంట్ అకౌంట్‌లోనే కాకుండా ఇతర అకౌంట్‌లో భారీ మొత్తంలో డబ్బు లావాదేవీలు జరిగి బాధితులు మోసపోతే బ్యాంకర్లపై కేసు నమోదు చేయాలన్న నిర్ణయానికి పోలీసులు వచ్చారు.

కరకష్టాలు



లంకపల్లి వద్ద పూర్తిగా ధ్వంసమైన కరకట్ట రోడ్డు

- పూర్తిగా ధ్వంసమైన పులిగడ్డ-విజయవాడ కరకట్ట రోడ్డు
- 62 కిలోమీటర్ల రహదారి మొత్తం గోతులమయం
- లంక గ్రామాల ఉత్పత్తుల రవాణాకు వీలుగా 1999లో ఏర్పాటు
- అనంతరం డబుల్ లేన్ రహదారిగా అభివృద్ధి
- అవనిగడ్డ నుంచి విజయవాడ దూరం తగ్గటంతో పెరిగిన రద్దీ
- నేడు ప్రమాదాలకు నిలయంగా మారిన వైనం

కృష్ణానదీ పరీవాహక గ్రామాలకు వరదల నుంచి రక్షణ కల్పించేలా, అవనిగడ్డ నుంచి విజయవాడ ప్రయాణ దూరాన్ని తగ్గించేలా 1999లో ఏర్పాటు చేసిన విజయవాడ- పులిగడ్డ కరకట్ట రోడ్డు నేడు పూర్తిగా ధ్వంసమైంది. అడుగడుగునా గుంతలు, ఎక్కడపడితే అక్కడ వేసిన స్పీడ్ బ్రేకర్లతో రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. కరకట్టపై ప్రయాణం అంటేనే వాహన చోదకులు భయపడేలా తయారైంది.

అవనిగడ్డ-ఆంధ్రజ్యోతి: బెజవాడ కరకట్ట రోడ్డుది పాతికేళ్ల ప్రస్థానం. 1998లో కృష్ణాజిల్లాను వణికించిన కృష్ణా వరదల కారణంగా విజయవాడ నుంచి పులిగడ్డ వరకు ఉన్న కృష్ణానది పరీవాహక గ్రామాలకు వరద ముంపు ఏర్పడే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. దీనికి తోడు నదీ సంగమ ప్రాంతమైన దివి ప్రాంతం బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయింది. నాడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఈ పరిస్థితిని స్వయంగా పరిశీలించి నదీ పరివాహక గ్రామాలను వరద తాకిడికి గురి కాకుండా, ఆయా గ్రామాల ప్రజలు తమ వ్యవసాయ ఉత్పత్తులను తేలికగా విజయవాడ మార్కెట్‌కు తరలించుకొనేలా పులిగడ్డ నుంచి విజయవాడకు ప్రయాణ దూరాన్ని తగ్గించేలా కరకట్ట రోడ్డుకు రూపకల్పన చేశారు. సింగిల్ లేన్ కరకట్టపై భారీ వాహనాలను అనుమతించలేదు. కేవలం చిన్న ట్రాన్స్‌పోర్టు వాహనాలను, ట్రాక్టర్లను ద్విచక్ర వాహనాలను మాత్రమే ఈ రహదారిపై నుంచి అనుమతించారు. భారీ వాహనాలు వెళ్లేందుకు వీలుగా 2006లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం హయాంలో ఈ రోడ్డును డబుల్ లేన్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు అనుమతులు ఇవ్వగా, 2013 నాటికి డబుల్ లేన్ రోడ్డు పనులు పూర్తయ్యాయి. అప్పటి నుంచి భారీ వాహనాలకు కూడా ఈ రోడ్డు గుండా వెళ్లే వెసులుబాటు కల్పించగా, అనంతరం ఆర్టీసీ అవనిగడ్డ నుంచి విజయవాడ వెళ్లేందుకు కరకట్ట సర్వీసులు కూడా ప్రవేశపెట్టింది. రోడ్డుపై రాకపోకలు పెరగడంతో రహదారి వెంబడి ఉన్న గ్రామాల్లో చిరు వ్యాపారులు పెరిగారు. లంక భూముల్లో పండించే పంటలను మార్కెట్ చేసుకోవడం రైతులకు తేలికగా మారిపోయింది.

ఇసుక అక్రమ రవాణాతో ధ్వంసం


2013లో ప్రారంభమైన కరకట్ట డబుల్ లేన్ రోడ్డు తదనంతరం నిర్వహణ సరిగ్గా లేక ధ్వంసం కావటం ప్రారంభమైంది. వాహనాల రాకపోకలు పెరగటంతో అత్యాశకు పోయి కరకట్ట పొడవునా వివిధ గ్రామాల సమీపంలో అక్కడి వ్యాపారులు స్పీడ్ బ్రేకర్లు ఇష్టారాజ్యంగా వేశారు. దీనికి తోడు గడిచిన అయిదేళ్లలో ఇసుక అక్రమ రవాణాకు కరకట్ట రోడ్డునే ఎక్కువగా ఉపయోగించడంతో రహదారి పొడవునా పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రయాణం దుర్లభంగా మారిపోయింది.

ప్రమాదాలకు అడ్డాగా..

కరకట్ట రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ఇప్పుడా రహదారి ప్రమాదాలకు అడ్డాగా మారిపోయింది. వారానికి కనీసం రెండు రోడ్డు ప్రమాదాలైనా ఈ దారిపై జరుగుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గోతుల రోడ్లలో కట్టలు విరిగి పలు మార్లు ఆర్టీసీ బస్సులు కరకట్ట రోడ్డుపై నుంచి కిందకు దూసుకుపోయిన ఘటనలు ఉన్నాయి. ఒకప్పుడు బెజవాడ వెళ్లాలంటే కరకట్ట రోడ్డునే ఎంచుకునే వాహనదారులు నేడు మచిలీపట్నం మిగతా 6లో..

ప్రతి ధాన్యపు గింజా కొంటాం

- రైతులు అధైర్య పడవద్దు
- దళారులను ప్రోత్సహించవద్దు
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల
- అవనిగడ్డ నియోజకవర్గంలో విస్తృత పర్యటన



చల్లపల్లిలో మొలకవచ్చిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్, చిత్రంలో ఎమ్మెల్యే మండలి

చల్లపల్లి/అవనిగడ్డ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ధాన్యపు గింజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు భరోసా ఇచ్చారు. అవనిగడ్డ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి బుధవారం మంత్రి మనోహర్ పర్యటించారు. జాతీయ రహదారిపై ఆరబోసుకున్న ధాన్యాన్ని పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చల్లపల్లి-పెదకళ్లేపల్లి రోడ్డులో హైవేపై రైతు సంఘం నేతలు, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆరబోసిన ధాన్యం, వర్షానికి తడిచి మొలకెత్తిన ధాన్యాన్ని రైతు ఉప్పల ఏడుకొండలు మంత్రికి చూపించారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ రైతులెవరూ అధైర్యపడవద్దని చెప్పారు. దళారులను ప్రోత్సహించవద్దనీ, ప్రభుత్వమే ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 24 గంటల్లోపే ప్రభుత్వం నుంచి రైతు ఖాతాలకు డబ్బులు జమచేసే ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. 30-40 రోజుల పాటు జరగాల్సిన ప్రక్రియ హడావుడిగా మూడు రోజుల్లో జరుగుతుండటంతో ఇబ్బందులు తలెత్తాయని, సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. ఇప్పటికే మిల్లర్లతో మాట్లాడామని, రైతు ధాన్యం తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి, మిల్లర్లకు ఉందని తెలిపారు. అన్నిరకాల ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు. రైతులను ఇబ్బందిపెడితే సహించేదిలేదన్నారు. రైతు సేవా కేంద్రంలో నమోదు చేసిన తేమశాతమే ప్రామాణికమని, మిల్లర్లు ఇబ్బందులు పెడితే తెలియజేయాలని, వారిని బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ మిగతా 6లో..

6లో

లక్ష్యం చేరని జల్‌జీవన్ మిషన్!

6లో

రేపటి నుంచి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు



కొండపల్లి బొమ్మకు పునర్వైభవం!

6లో

6 నుంచి రెవెన్యూ సమస్యలపై సదస్సులు

- ఎన్టీఆర్ జిల్లాలో నిర్వహణకు ప్రణాళికలు
- మంత్రి అనగాని వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ లక్ష్మీశ



కృష్ణలంక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యల పరిష్కార దిశగా ఈనెల 6నుంచి జిల్లాలో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు అవసరమైన అన్నిచర్యలు తీసుకోవడం జరిగిందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించినట్టు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ప్రత్యేక కార్యదర్శి ఆర్పీ సిసోడియాలకు కలెక్టర్ వివరించారు. ఈనెల 6వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుల నిర్వహణపై మంత్రి అనగాని సత్యప్రసాద్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా, సీసీఎల్ఏ కమిషనర్ జి.జయలక్ష్మిలు జిల్లా కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 320 రెవెన్యూ గ్రామ పంచాయతీల పరిధితో పాటు విజయవాడ, నందిగామ, జగ్గయ్యపేట, ఇబ్రహీంపట్నం, తిరువూరు పట్టణ వార్డు సచివాలయ పరిధిలో ఈనెల 6న రెవెన్యూ సదస్సులు నిర్వహించేలా చర్యలు తీసుకొంటామన్నారు. ఇందుకు సంబంధించిన తేదీలు ప్రజలకు ముందుగానే తెలియపరిచేలా సదస్సుల షెడ్యూల్‌ను కరపత్రాల రూపంలో ముద్రించి అన్ని గ్రామాలలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకొన్నామన్నారు. ప్రజల ఫిర్యాదులు, వినతులపై తక్షణ చర్యలు తీసుకొంటామన్నారు. ముఖ్యంగా సదస్సులో అన్ని రకాల భూ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకొంటున్నామన్నారు. సదస్సుల నిర్వహణ పర్యవేక్షణకు అధికారులను నియమించడం జరిగిందని ఒక్కొక్క మండలానికి జిల్లాస్థాయి అధికారిని పర్యవేక్షకులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేయడం జరిగిందన్నారు. రెవెన్యూ సదస్సులపై 5వ తేదీ గురువారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించి సదస్సుల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్నట్టు కలెక్టర్ వివరించారు. సమావేశంలో జేసీ నిధి మీనా, డీఆర్వో లక్ష్మీ నరసింహం, కలెక్టరేట్ సమన్వయ పర్యవేక్షకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సహకారంతో సమర్థ విపత్తు నిర్వహణ

- ఈ దిశగా అవగాహన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి

కృష్ణలంక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సరైన సన్నద్ధతతోనే సమర్థవంత విపత్తు నిర్వహణకు వీలుపడుతుందని, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాస్థాయిలో విపత్తులను ఎదుర్కొనేందుకు సన్నద్ధత చర్యలు తీసుకొంటున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. భవిష్యత్తులో విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మరింత మెరుగైన కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విపత్తు సంభవించిన పరిస్థితిలో సత్వరం అధికార యంత్రాంగం తీసుకొంటున్న సహాయక చర్యలకు ప్రజా సహకారం అవసరమని, ఈ దిశగా ప్రజలకు ర్యాలీలు, స్థానిక సమావేశాలు, కరపత్రాలు తదితరాల ద్వారా అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకొంటున్నట్టు తెలిపారు. అధికారులకు ఎప్పటికప్పుడు శిక్షణ కార్యక్రమాలతో పాటు మాక్‌డ్రిల్స్ నిర్వహణ కూడా ముఖ్యమని వివరించారు. ఎన్‌డీఎంఏ, ఎస్‌డీఎంఏ మార్గదర్శకాలకు అనుగుణంగా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న జిల్లా విపత్తు నిర్వహణ అధీకృత సంస్థ (డీడీఎంఏ) ఆధ్వర్యంలో ఇందుకు చర్యలు తీసుకొంటున్నట్టు తెలిపారు.

రేపట్నుంచి సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి కల్యాణ మహోత్సవాలు



మోపిదేవి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో షష్ఠి కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. 6వ తేదీ ఉదయం 11 గంటలకు స్వామివారిని పెండ్లి కుమారుడిని చేయుటంతో కల్యాణ మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 7న స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవం, సాయంత్రం 6 గంటలకు మయూర వాహనంపై గ్రామోత్సవం, 8న స్వామివారి గ్రామోత్సవం, పుష్పశయనాలంకృత పర్యాంక సేవతో మహోత్సవాలు ముగుస్తాయన్నారు. స్వామివారి షష్ఠి కళ్యాణ మహోత్సవాలు పురస్కరించుకుని నిత్య అర్జిత సేవలన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్టు తెలిపారు.

ప్రతి ధాన్యపు గింజా కొంటాం

(5వ పేజీ తరువాయి)

బెనర్జీ, రైతు నేత వేమూరి రత్నగిరిరావు రైతు సేవా కేంద్రంలో నమోదు చేస్తున్న తేమ శాతానికి, రైస్‌మిల్లర్ల దగ్గర తేమశాతానికి వ్యత్యాసం ఉంటోందని మంత్రి దృష్టికి తెచ్చారు. జిల్లాలో ఉన్న 170 రైస్ మిల్లుల్లో 70 డ్రయ్యర్లు మాత్రమే ఉన్నాయని, మిల్లుల్లో డ్రయ్యర్లు పెంచే ఏర్పాటు చేయాలని కోరారు. డ్రయ్యర్లు ఉంటే ధాన్యం తడవడం, మొలకెత్తడం వంటి సమస్యలు ఉత్పన్నం కావన్నారు. ఈ ప్రాంతంలోనే ధాన్యం ఆరబెట్టేందుకు డ్రయ్యర్ ప్లాంట్ ఏర్పాటు చేద్దామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డీఎస్‌వో వి.పార్వతి, ఆర్డీవో స్వాతి, సివిల్ సప్లయిస్ డీఎం పద్మజారాణి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

- అధికారుల సమావేశంలో మంత్రి మనోహర్

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. బుధవారం అవనిగడ్డ తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో అవనిగడ్డ నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే 9 లక్షల 91 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు రూ.22.83 కోట్ల నగదు చెల్లించామని తెలిపారు. ఇందులో రూ. 20.67 కోట్లను రైతు ధాన్యం విక్రయించిన 24 గంటల్లోపే వారి ఖాతాలకు జమ అయ్యాయన్నారు. గత వైసీపీ పాలనలో ధాన్యం తోలిన తర్వాత రైతులు నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చిందని గుర్తు చేశారు. రైతులు నచ్చిన మిల్లుకు ధాన్యం అమ్ముకునే అవకాశం కల్పించటంతోపాటు జీపీఎస్ నిబంధనలు కూడా తొలగించామని తెలిపారు. కొందరు మిల్లర్లు, దళారులు కలసి ధర తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాలు తమ దృష్టికి వచ్చాయని, వాటిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులకు ఇబ్బందులు కలిగించే మిల్లర్లపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. 25 శాతం తేమ ఉన్నా తక్షణమే ధాన్యం కొనేలా చర్యలు చేపడతామన్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలో 12,272 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 1,441 మంది రైతులకు రూ.25.89 కోట్లు చెల్లించామని వివరించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ప్రతిష్ఠాత్మకంగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ బోడపాటి శివదత్తు, ఏబీఐసీ డైరెక్టర్ మండలి రాజేష్, బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి బొమ్మకు పునర్వైభవం!

- కళా సుస్థిరతకు ప్రభుత్వ పరంగా పూర్తి మద్దతు
- తెల్ల పొణికి కొరత సమస్య పరిష్కారానికి జాయింట్ కమిటీ
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ వెల్లడి



కొండపల్లి బొమ్మ తయారీని తిలకిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ



తెల్ల పొణికి చెక్కను పరిశీలిస్తున్న కలెక్టర్

కృష్ణలంక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తెలుగు నేల సంప్రదాయ కళా ఔన్నత్యానికి కొండపల్లి బొమ్మలు చిహ్నమని, సమష్టి కృషితో కొండపల్లి బొమ్మ కళకు పునర్వైభవం తెద్దామని, కళా సుస్థిరతకు ప్రభుత్వపరంగా పూర్తి మద్దతు వుంటుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ, డీఆర్డీఏ, డ్వామా, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి కొండపల్లి బొమ్మల కళాకారుల సహకార సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. బొమ్మల తయారీకి ముడిసరుకు అయిన తెల్ల పొణికిని పరిశీలించడంతో పాటు కళాకారులు అద్భుత నైపుణ్యాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, దేశ విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు ఉన్న కొండపల్లి బొమ్మలకు డిమాండ్‌తో పాటు మార్కెటింగ్ అవకాశాలు బాగున్నప్పటికీ బొమ్మ తయారీకి అవసరమైన తెల్ల పొణికి లభ్యత సమస్యగా వుందన్నారు.

తెల్ల పొణికి నర్సరీల అభివృద్ధి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో తెల్లపొణికి నర్సరీ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నాయని కలెక్టర్ అన్నారు. తెల్లపొణికి లభ్యతను పెంచేలా శాఖల సమన్వయంతో ప్రత్యేక జాయింట్ కమిటీ వేయనున్నట్టు చెప్పారు. ఒకవైపు అటవీ నిబంధనలను పాటిస్తూనే మరోవైపు తెల్ల పొణికి కళాకారులకు అందుబాటులో వుండేలా పటిష్ఠ ప్రణాళికతో చర్యలు తీసుకోనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ ఎ.రాము, డీఎఫ్‌వో జి.సతీష్, కొండపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కంపించిన భూమి.. ఉలిక్కిపడిన జనం!

ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం ఉదయం 7 గంటల సమయంలో భూమి స్వల్పంగా కంపించింది. ప్రకంపనలు రెండు సెకన్లలోపే ఉండటంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. కొన్ని చోట్ల ఇంటి గోడలు స్వల్పంగా బీటలు వారాయి. ఏం విపత్తు వస్తుందోనని ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

గన్నవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) :

- గన్నవరం మండలంలో పలుచోట్ల బుధవారం ఉదయం భూమి కంపించింది. దీంతో ఇళ్లలో ఉన్న వారు భయాందోళన చెందారు. ఉదయం 7.26గంటల సమయంలో కొన్ని సెకన్ల పాటు భూమి కంపించడంతో ఎం జరిగిందో తెలియక ఇళ్లలో ఉన్న వారు బయటకు పరుగులు తీశారు. కేసరపల్లి, గన్నవరం, పురుషోత్తపట్నం గ్రామాల్లో భూమి కంపించిందని గ్రామస్తులు తెలిపారు. కేసరపల్లిలో ఇంటి గోడ కాస్త నెర్రలిచ్చింది.
- గంపలగూడెం తదితర ప్రాంతాల్లో ఉదయం 7.20లకు భూమి స్వల్పంగా కంపించింది. తోటమూల, గంపలగూడెంలలో గోడలపై పెట్టిన సామగ్రి కింద పడ్డాయని స్థానిక ప్రజలు చెప్పారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు పెట్టారు.
- తిరువూరు మండలంలో.. సాయిబాబా గుడి వెనుక, పాతతిరువూరు, ఎస్ఎస్సీ కాలనీ, మండలంలోని లక్ష్మీపురంతో పాటు పలుగ్రామాల్లో భూమి కంపించడంతో ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. రాజుపేటలో చామర్తి కోటేశ్వరరావుకు చెందిన ఇంటి గోడకు నెర్రలు ఏర్పడ్డాయి.
- నందిగామ డివిజన్‌లో ఉదయం 7.28 సమయంలో ప్రకంపణలు వచ్చాయి. జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, నందిగామ, కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో ప్రకంపనలు వచ్చినట్టు స్థానికులు తెలిపారు. కుర్చీలు, వంట సామగ్రి కదిలాయని గనిఆత్కూరుకు చెందిన ఉపసర్పంచ్ మూరకొండ ఏడుకొండలు, మోగులూరుకు చెందిన వెలగా నరసింహారావు చెప్పారు. పెద్దగా శబ్ధాలూ రాకపోవటంతో చాలా మంది గమనించలేదు.
- జగ్గయ్యపేట పట్టణంలో తొర్రగుంటపాలెం, విద్యానగర్ రైల్వే కట్టతో పాటు కృష్ణానది పరివాహక ప్రాంతం ముక్త్యాల గ్రామంలో స్వల్పంగా భూమి కంపించింది. రెండు సెకన్లు ప్రకంపనలు ఉన్నట్టు స్థానికులు చెప్పారు. ఆందోళనతో రోడ్డు మీదకు పరుగులు తీశారు. ఇళ్లల్లో కొన్ని చోట్ల వస్తువులు కింద పడ్డాయి.
- జగ్గయ్యపేట రూరల్ మండలంలోని అన్ని గ్రామాలలో భూమి కంపించింది. నదీ తీర ప్రాంతాల్లో ప్రభావం ఎక్కువ ఉందని ఆయా గ్రామాల నుంచి సమాచారం అందింది. భూమి కంపించటంతో ఇళ్లలోని వారు పరుగులు పెట్టారు. ఎలాంటి ప్రమాదం లేకపోవటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.
- పెనుగంచిప్రోలులో బుధవారం ఉదయం కొద్దిసేపు భూమి కంపించింది. ఇళ్లలో సామాగ్రి పక్కకు జరిగాయి. అక్కడక్కడ రేకులు శబ్ధాలు వచ్చినట్టు పలువురు తెలిపారు.

భయకంపం

(5వ పేజీ తరువాయి)

ఇంటి గోడకు బీటలు వచ్చాయి. సీసీ కెమెరాల్లో భూప్రకంపనలు స్పష్టంగా కనిపించాయి. కొన్నిచోట్ల ప్రజలు భయంతో పరుగులు తీశారు. గంపలగూడెంలో గోడలపై ఉన్న పాత్రలు కిందపడ్డాయి. హనుమాన్ జంక్షన్‌లోని ఓ వీధిలో భూమి ఊగినట్టు సీసీ కెమెరాల్లో స్పష్టంగా తెలిసింది.

అంత ప్రమాదం కాదు : శాస్త్రవేత్తలు

ఈ ప్రకంపనలతో జిల్లాలోని తీరప్రాంతంలో ప్రజలు భయాందోళన చెందారు. అయితే, కాసేపటికే పరిస్థితి మామూలుగా మారడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రకంపనలకు భయపడాల్సిన అవసరం లేదని కొంతమంది శాస్త్రవేత్తలు చెబుతుండగా, భూకంపాలు వచ్చే రోజులు దగ్గరలో ఉన్నాయని మరికొంతమంది విశ్లేషిస్తున్నారు. జోన్-2లో ఉన్న ప్రాంతాలకు ఎలాంటి ప్రమాదం లేదని భౌతిక శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. రాబోయే రెండు, మూడు నెలల్లో ఇలాంటి పరిస్థితి వస్తుందని వెల్లడిస్తున్నారు. జోన్-2లో భూమి ఎప్పుడూ రిక్టర్ స్కేల్‌పై 6-6.05 దాటి కంపించదని వారు పేర్కొంటున్నారు.

సాధారణ ప్రకంపనలే..

- శ్రీకుమార్, ఆంధ్ర లయోలా కళాశాల భౌతికశాస్త్ర విభాగాధిపతి

ఈ భూప్రకంపనలు సాధారణమైన విషయం. భూమి నిత్యం కంపిస్తూ ఉంటుంది. ఇది జోన్-2కు పెనుప్రమాదమేమీ కాదు. భూమి ఏడో పలకపై ఉంది. దీన్ని ఏషియన్ ప్లేట్ అంటారు. ఆసియా ఖండం మొత్తం ఈ పలకపై ఉంది. దీనికి పక్కనే యురేపియన్ పలక ఉంది. ఇది ఐరోపా ఖండానికి సంబంధించినది. ఈ రెండు పలకలు ఒక దాన్ని మరొకటి ఢీ కొనడంతో ఒత్తిడి పెరుగుతోంది. అందుకే భూప్రకంపనలు అటూ ఇటూ ఊగుతున్నట్టుగా వచ్చాయి. పైకి, కిందకు ఎగురుతున్నట్టుగా రాలేదు. తీవ్రమైన భూకంపాలు హిమాలయ పర్వతాలు, సింధు, పాకిస్తాన్, కచ్, కశ్మీర్ నుంచి నేపాల్, టిబెట్, భూటాన్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ ప్రాంతాల్లో వస్తాయి. ఇవన్నీ ఐదో జోన్‌లో ఉన్నాయి. కాబట్టి రాష్ట్రంలో కానీ, జిల్లాలో కానీ భూకంపాలు రావడానికి ఎలాంటి ఆస్కారం లేదు. దీని గురించి ప్రజలు భయపడి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.





ఉయ్యూరులో సత్యా షోరూమ్ ప్రారంభిస్తున్న సంస్థ నిర్వాహకులు సెంతిల్, ఫాదర్ రెవరెండ్ జాకబ్‌జాన్

ఉయ్యూరులో సత్యా షోరూమ్ ప్రారంభం

ఉయ్యూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పలుప్రాంతాల్లో సుదీర్ఘకాలంగా వినియోగదారుల మన్ననలు పొందుతూ ఉయ్యూరు, పరిసర గ్రామాల ప్రజలకు అందుబాటులోకి వచ్చిన సత్యా షోరూమ్ 40వ బ్రాంచ్ ప్రారంభించడం శుభ పరిణామమని సంస్థ ఏపీ హెడ్ సెంతిల్ అన్నారు. స్థానిక కాటూరు రోడ్డులో సత్యాషోరూమ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల ఎలాక్ట్రానిక్ వస్తువులు, హోమ్ అప్లయెన్సెస్‌తో పాటు, సెల్‌ఫోన్‌లు అతి తక్కువ ధరకు లభిస్తాయన్నారు. ఉయ్యూరు, పరిసర ప్రజలు ఈఅవకాశం సద్వినియోగంచేసుకోవాలన్నారు. ఉయ్యూరు ప్రజలకు వస్తువులను అతితక్కువ ధరకు అందచేయడం సత్యాఏజెన్సీస్ ప్రత్యేకత అని మేనేజర్ పూర్ణ పేర్కొన్నారు. ఫాదర్ జాకబ్ జాన్, మహ్మద్ ఉమర్, జుల్ఫర్ నీనే తదితరులు పాల్గొన్నారు.

కర కష్టాలు!



కరకట్టపై బోల్తా పడిన ఆర్టీసీ బస్సు(ఫైల్)

(5వ పేజీ తరువాయి)

మీదుగా విజయవాడ వెళ్తున్నారంటే కరకట్ట రోడ్డు వాహనదారులను ఎంతగా భయపెట్టిందో అర్థం చేసుకోవచ్చు. నిత్యం వందలాది వాహనాలు, వేలాది ప్రజలు, కోట్ల రూపాయల విలువైన వ్యవసాయ ఉత్పత్తులు రవాణా జరిగే ఈ రోడ్డు దుస్థితి గురించి నాటి ప్రభుత్వం పట్టించుకోలేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి వీలైనంత త్వరగా కరకట్ట రోడ్డును అభివృద్ధి చేయాలని వాహన చోదకులు, లంక గ్రామాల రైతులు కోరుతున్నారు.

వణికించిన వరదలు

కృష్ణా కరకట్ట ధ్వంసమైన పలు చోట్ల ఇటీవల సంభవించిన వరదల సమయంలో అక్కడి ప్రజలు భయంతో వణికిపోయారు. మోపిదేవి మండల పరిధిలోని బొబ్బర్లంక, చల్లపల్లి మండలం రాముడుపాలెం వద్ద, పమిడిముక్కల మండలం అప్పారావుపేట వద్ద కుంగిపోయిన రోడ్డు వరకు వరద నీరు వచ్చింది. ఆయా ప్రాంతాల్లో ఏ మాత్రం ఓల పడినా గ్రామాలకు గ్రామాలు కొట్టుకుపోయే పరిస్థితి వచ్చేదని కృష్ణానది పరీవాహక ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గోతుల్లో పడి విరిగిన ఆర్టీసీ బస్సు కమాను కట్టలు

ఆర్టీసీ డ్రైవర్లకు తప్పని అవస్థలు

అవనిగడ్డ నుంచి విజయవాడ తిరిగే కరకట్టపై ఆర్టీసీ బస్సు డ్రైవర్ల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. అవనిగడ్డ నుంచి విజయవాడ వైపునకు కేవలం రెండున్నర గంటల సమయం మాత్రమే అధికారులు నిర్దేశించారు. రహదారి పూర్తిగా గోతులమయం కావటం, దాదాపు 69 స్పీడ్ బ్రేకర్లు ఉండటంతో బస్సులను సమయానికి గమ్యస్థానానికి చేర్చేందుకు డ్రైవర్లు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ క్రమంలో కమాన్ కట్టలు, మెయిన్లు విరిగిపోయి బస్సులు అదుపు తప్పిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అధికారులు చేసే తప్పిదాలకు తాము బాధ్యత వహించాల్సి వస్తుందని పలువురు డ్రైవర్లు వాపోతున్నారు. ఈ రోడ్డుపై బస్సులు పూర్తిగా ధ్వంసం కావటంతో ఆర్టీసీకి లక్షలాది రూపాయల విడి భాగాల రూపంలో నష్టం వాటిల్లుతుందని, వీటిని అధికారులు తమ ఖాతాలో వేస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు.

రూ.125 కోట్లతో అంచనాలు

-రావెళ్ల రవి కిరణ్, ఈఈ ఇరిగేషన్ శాఖ

పులిగడ్డ-విజయవాడ కరకట్ట రోడ్డు ధ్వంసమై తరచూ ప్రమాదాలు జరుగుతున్న విషయం వాస్తవమే. నాలుగు నియోజకవర్గాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే ఈ రహదారి అభివృద్ధి చేసేందుకు రూ.125 కోట్లతో అంచనాలు రూపొందించాం. ప్రభుత్వ ఆమోదం త్వరలోనే వచ్చే అవకాశం ఉంది. రాగానే అభివృద్ధి పనులు చేపడతాం.

కరకట్టను పటిష్టం చేయాలి

-అద్దాడ ప్రసాద్‌బాబు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి



వైసీపీ పాలనలో ఇసుక, బుసక టిప్పర్లు యథేచ్ఛగా తిరగటంతో కరకట్ట అనేక చోట్ల దెబ్బతింది. ఎలాంటి మరమ్మతులు చేయకపోవటంతో నేడు ప్రమాదకరంగా మారింది. అనేక చోట్ల కుంగిపోవడం, పగుళ్లు ఇవ్వడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. కూటమి ప్రభుత్వమైనా కరకట్టను పటిష్టం చేయాలి. కృష్ణానదికి వరదలు వచ్చినా తట్టుకునేలా ఎత్తును సైతం పెంచాల్సిన అవసరం ఉంది.

నా తండ్రి మృతికి కారణం తలశిల రఘురాం

- సీఎం చంద్రబాబు ఎదుట బోరుమన్న కారెంపూడి అభిరామ్
- ఆస్తులు లాక్కుని ఆత్మహత్యకు కారణమయ్యారని ఫిర్యాదు

గొల్లపూడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నా తండ్రి కారెంపూడి రవీంద్ర బలవన్మరణానికి వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాం కారణమని తనకు, తమ కుటుంబానికి న్యాయం చేయాలని రవీంద్ర కుమారుడు కారెంపూడి అభిరామ్ సీఎం చంద్రబాబు ఎదుట బోరున విలపించాడు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం చంద్రబాబు పలువురు బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఎమ్మెల్సీ తలశిల రఘురాం తన తండ్రిపై అక్రమ కేసు పెట్టి వేధించాడని, నాటి సీఐ రవీంద్ర, ఏసీపీ హనుమంతరావులతో బెదిరించి రూ.10 కోట్ల విలువైన ఆస్తులను రాయించుకున్నారని వాపోయాడు. ఎంపీటీసీ ఎన్నికల్లో తన తండ్రి రవీంద్ర నామినేషన్ వేశాడనే అక్కసుతో వేధించి కేసులు పెట్టి జైల్లో పెట్టారని వివరించాడు. తమ దగ్గర అప్పులు తీసుకున్న వారిని తిరిగి ఇవ్వకుండా అడ్డుకొని రూ.3.5 కోట్లు నష్టపోయేలా చేశారని వైసీపీ వేధింపులు తట్టుకోలేకే తన తండ్రి బలవన్మరణానికి పాల్పడ్డాడని కన్నీరు మున్నీరుగా విలపించాడు. రఘురాంపై పూర్తిస్థాయి విచారణ చేయించాలని ఆయనకు సహకరించిన పోలీసులపై విచారణకు ఆదేశించాలని కోరారు.

ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి అధ్యక్షుడిగా అప్పన రామ్‌కుమార్

జగ్గయ్యపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి ఎన్టీఆర్‌జిల్లా అధ్యక్షుడిగా పట్టణ హెచ్‌పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ అప్పన రామ్‌కుమార్‌ను నియమించినట్టు రాష్ట్ర అధ్యక్షుడు చారుగుండ్ల కొండా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరబాద్‌లో మాజీ ముఖ్యమంత్రి రోశయ్య వర్థంతి కార్యక్రమంలో నియామక పత్రాన్ని ఆయన అందుకున్నారు.


సామర్థ్యాధారిత పరీక్షలకు 2940 మంది హాజరు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లాలో 108 పాఠశాలల్లో 3, 6,9 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన సామర్థ్యాధారిత పరీక్షలకు 2940 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా రిసోర్సు పర్సన్ విజయమాధురి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పరీక్షల్లో సీబీఎస్ఈ బోర్డు ఇన్‌ఛార్జి ప్రాంజల్ సెక్సాతో పాటు ఇన్విజిలేటర్లు వివిధ పాఠశాలలను సందర్శించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు, డిప్యూటీ ఈవో సింగ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం చేరని జల్‌జీవన్ మిషన్!

- పామర్రులో ఇప్పటికీ పూర్తికాని పథకం
- పనుల నిర్వహణలో అధికారుల అలసత్వం
- వైసీపీ హయాంలో రూ. కోటి గోల్‌మాల్ అయినట్టు ఆరోపణలు

(ఆంధ్రజ్యోతి, పామర్రు) : ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా.. గ్రామీణ ప్రాంత ప్రజల దాహార్తి తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జలజీవన్ మిషన్ పథకం లక్ష్యం నీరుగారుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ పథకం నిధులు స్వాహా అయ్యాయన్న విమర్శలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ప్రజలకు ఇంటింటి కుళాయిలు ఏర్పాటుచేసి రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించాలనే సంకల్పంతో జల్‌జీవన్ మిషన్ పథకం కింద ప్రభుత్వం రూ.4.35 కోట్ల నిధులను వెచ్చించింది. 2022 నవంబరు 3న నాటి వైసీపీ ఎమ్మెల్యే అట్టహాసంగా భూమిపూజ చేశారు. స్థానిక గంగానమ్మ గుడిచెరువు గట్టున స్టోరేజి ట్యాంకుతోపాటు, చెన్నువానిపురంలో మరో ఓవర్ హెడ్‌ట్యాంకు నిర్మాణపనులు హడావిడిగా చేపట్టారు. అయితే వాటికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన పైప్‌లైన్లను అసంపూర్తిగానే వదిలేశారు. అధికారుల నిర్లక్ష్యం.. పాలకుల అవినీతి దాహంతో పామర్రు పట్టణంలో పథకం అమలుకు నోచుకోవడంలేదు. రూ.కోటికి పైగా నిధులు గోల్‌మాల్ అయినట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఈ పథకం త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దాంతో పాటు అవినీతి ఆరోపణలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



నిరుపయోగంగా ఉన్న ట్యాప్‌లు



పూర్తయినా అందుబాటులోకిరాని వాటర్ ట్యాంకు



దీనిపై డీఈ సత్యనారాయణ వివరణ ఇస్తూ పట్టణంలో పథకానికి సంబంధించి విద్యుత్ శాఖతో కొంత సాంకేతిక ఇబ్బందులున్నాయని, సంబంధిత కాంట్రాక్టర్లకు కొంతమేర బిల్లులు మంజూరు చేయలేదన్నారు.

ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అన్ని మండలాలకు కృష్ణా జలాలు నేరుగా అందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. అలాగే గత ప్రభుత్వ హయంలో పథకంలో అవినీతి ఆరోపణలపై విచారణ చేయిస్తామన్నారు. త్వరలో రక్షిత నీటిని ప్రజలకందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105,113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 620

మార్కెట్ విలువను ఆన్‌లైన్ చేయాలి

గన్నవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని గారపాడు, మెట్లపల్లిలో భూముల క్రయవిక్రయాలు నిలిచిపోయాయని ఆ గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు గ్రామాలకు సంబంధించి మార్కెట్ విలువలను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవటం వల్ల భూముల రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. ఈ భూములకు గతంలో రీసర్వే నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల భూముల మార్కెట్ విలువను నమోదు చేసి జిల్లా రిజిస్ట్రార్‌కు పంపించారు. అక్కడ మార్కెట్ విలువ అప్రూవల్ కాకపోవటంతో సాంకేతిక సమస్య తలెత్తింది. దీనివల్ల రెండు గ్రామాల్లో రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. అధికారులు స్పందించి ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ప్రిన్సిపాల్

ఆదిత్య బధిర ప్రిన్సిపాల్‌కు ఏలూరు కలెక్టర్ ప్రశంస

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బధిర విద్యార్థుల సాధికారతకు విశేషంగా కృషిచేస్తున్న స్థానిక ఆదిత్య బధిర విద్యాలయం ప్రిన్సిపాల్ ఆకుల వెంకటరమణను ప్రభుత్వం ప్రశంసించింది. ఏలూరులో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకల్లో ఆ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ప్రశంసాపత్రం అందించి శాలువతో సత్కరించి దివ్యాంగుల సాధికారతకు చేస్తున్న కృషిని అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు,మిత్రులు వెంకటరమణకు అభినందనలు తెలియజేశారు.



మానవత కార్యాలయంలో ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

అమర గాయకుడు ఘంటసాలకు ఘన నివాళి

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. బుధవారం పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో ఏలూరు ఘంటసాల స్వరపీఠం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మానవత సభ్యులు జయ రామచంద్రరావు, గణేష్, ఇందిర, సత్యనారాయణ, వేగిరెడ్డి సూర్యనారాయణ, ప్రభాకర్, నరసింహారావు పాల్గొన్నారు.



పరీక్ష సెంటర్‌ను పరిశీలిస్తున్న కృష్ణారెడ్డి

ఎన్‌ఏఎస్ పరీక్ష సెంటర్ల పరిశీలన

గన్నవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేసరపల్లి ఎంపీపీ పాఠశాలలో జరిగిన నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే (ఎన్‌ఏఎస్) పరీక్ష సెంటర్‌లను బుధవారం ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి పరిశీలించారు. దేశవ్యాప్తంగా 3, 6, 9 తరగతి విద్యా ర్థులకు మినిమం నాలెడ్జి ఉందా లేదా అని అన్ని సబ్జెక్టుల్లో ఎన్‌ఏఎస్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో 8 పాఠశాలలో ఈ పరీక్ష జరుగుతున్నట్లు ఎంఈవో కొండా రవికుమార్ తెలిపారు. డీసీఈబీ సెక్రటరీ జాన్ సాహెబ్, డీవైఈవో పద్మారాణి, ఎంఈవో-2 కమల తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఫైనాన్సులో ఆటో తీసుకొని నడుపుకొంటున్న ఒక వ్యక్తి ఫైనాన్సు కట్టలేక, ఫైనాన్సు వారి వేధింపులు తట్టుకోలేక కనిపించకుండా పోయిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తాడిగడప రాంనగర్ కట్ట ప్రాంతానికి చెందిన కుప్పాల అశోక్‌కుమార్ టాటా, శ్రీరాం ఫైనాన్సు సంస్థల్లో ఫైనాన్సు తీసుకొని ఆటో నడుపుకుంటున్నాడని, ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక అదే ఆటోను కంకిపాడుకు చెందిన ఒక వ్యక్తి వద్ద తాకట్టు పెట్టాడని, తాకట్టు పెట్టిన వ్యక్తికి తిరిగి డబ్బు చెల్లించకపోవడంతో మనస్తాపానికి గురైన అశోక్ కనిపించకుండా పోయాడని అతని భార్య యువరాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పుష్ప-2ను అడ్డుకోము

- జనసేన గన్నవరం సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పుష్ప-2 సినిమాపై బుధవారం ఉదయం చేసిన ప్రకటనను ఉపసంహరించుకుంటున్నట్లు రమేష్‌బాబు సాయంత్రం తెలిపారు. ప్రజలకు నష్టాన్ని కలిగించడం జనసేన ఉద్దేశం కాదని, మరో హీరోల సినిమాను దెబ్బతీయడం మెగా అభిమానుల అభిమతం కాదని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు స్వయంగా ఫోన్ చేసి తనకు సూచించడం జరిగిందని తెలిపారు. ఆయన సూచనల మేరకు తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు తెలిపారు.

వీఆర్వో కార్యాలయ నిర్మాణం కూల్చివేత

- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకువెళ్లిన కేసరపల్లి గ్రామస్తులు
- అధికారులకు సమాచారం లేకుండా కూల్చివేతపై పోలీసులకు ఫిర్యాదు
- రూ. 4 లక్షల ప్రజాధనం వృథా





నిర్మాణంలో ఉన్న వీఆర్వో కార్యాలయ భవనం .. కూల్చివేసిన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి

గన్నవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేసరపల్లి సర్వే నెంబర్ 196-5లో గత ఐదేళ్ల క్రితం నిర్మాణం చేపట్టిన వీఆర్వో కార్యాలయాన్ని బుధవారం అక్రమంగా కూల్చివేశారు. పంచాయతీకి గాని, రెవెన్యూ అధికారులకు కాని ఎలాంటి సమాచారం ఇవ్వ కుండా ఇష్టారాజ్యంగా గ్రామానికి చెందిన పలువురు చేసిన తీరు విస్మయం కలిగించింది. గ్రామ ప్రజల అవసరాల కోసం సెంటర్‌లో ఉన్న పంచాయతీ స్థలంలో వీఆర్వో కార్యాలయాన్ని నిర్మించాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. 2019లో అప్పటి తహసీల్దార్‌కు వివరించగా పంచాయతీ తీర్మానం తీసుకువస్తే తమకు ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. అలాగే తీర్మానం చేసి తీసుకువెళ్లారు. రూ.2లక్షలు నగదు కార్యాలయ నిర్మాణానికి తహసీల్దార్ ఇచ్చారు. వాటితో పాటు గ్రామస్తులు మరో రెండు లక్షలు వేసుకుని పల్లంగా ఉన్న భూమిలో మెరక తోలించారు. కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయటంతో పాటు పిల్లర్స్ సన్‌సైడ్‌ల వరకూ పోశారు. అనివార్య కారణాలతో ఆ నిర్మాణ పనులు ఆగిపోయాయి. అయితే ఇటీవల అక్కడ గౌడ కమ్యూనిటీకి వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించాలని కొంత మంది గ్రామస్తులు అనుకున్నారు. సెప్టెంబరు నెలలో పంచాయతీ తీర్మానం కూడా చేయించారు. అందులో ఖాళీ స్థలంలో మాత్రమే ఆలయం నిర్మించుకోవాలని అధికారులు తెలిపారు. అలా కాకుండా వార్డు సభ్యుడు యారగాని రత్తయ్య మరికొందరి సహాయంతో జేసీబీతో వీఆర్వో కార్యాలయ నిర్మాణాన్ని అక్రమంగా కూల్చివేశారు. కార్యాలయ నిర్మాణాన్ని అక్రమంగా కూల్చివేయటంపై గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ నిర్మాణానికి వ్యతిరేకం కాదు కాని గ్రామస్తులందరికీ ఉపయోగపడే వీఆర్వో కార్యాలయ నిర్మాణాన్ని కూల్చివేయటం సరికాదంటున్నారు. మరోచోట ఆలయ నిర్మాణం చేసుకోవాలి తప్ప నిర్మాణంలో ఉన్న భవనాన్ని కూల్చివేయటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

కూల్చివేతపై చర్యలు తీసుకుంటాం

వీఆర్వో కార్యాలయ నిర్మాణాన్ని అక్రమంగా కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకుంటాం. ఆర్ఐ, వీఆర్వోలు వెళ్లి గ్రామంలో విచారించి రిపోర్టు తయారు చేయమని ఆదేశించా. గ్రామ రెవెన్యూ కార్యాలయ నిర్మాణాన్ని తమకు సమాచారం లేకుండా కూల్చివేయటం నేరం. వచ్చిన రిపోర్టును బట్టి చర్యలు చేపడతాం.

- కేవీ శివయ్య, తహసీల్దార్

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు ఫిర్యాదు..

గ్రామంలో జరుగుతున్న వివాదాన్ని పలువురు నాయకులు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు వివరించారు. గ్రామ ప్రధాన సెంటర్‌లో వీఆర్వో కార్యాలయం ఉంటే అందరికి ఉపయోగకరంగా ఉంటుందని, గతంలో చేసిన తీర్మానాన్ని పట్టించుకోకుండా మళ్లీ తీర్మానం చేయించి నిర్మాణాన్ని పడగొట్టించారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

డీఈవో పీవీజే రామారావు



గృహనిర్మాణాల పురోగతిపై సమీక్షిస్తున్న మండల ప్రత్యేకాధికారి, డీఈవో రామారావు

ఉంగుటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని, ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం కింద పేదల కాలనీల్లో ఇళ్లస్థలాలు పొందిన లబ్ధిదారులందరూ త్వరితగతిన ఇళ్లనిర్మాణాలు పూర్తిచేసేలా వారిని చైతన్యపరచాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో)పీవీజే రామారావు అధికారులకు సూచించారు. గృహ నిర్మాణాల పురోగతిపై మండలంలోని 16 సచివాలయాల పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మండల హౌసింగ్ అధికారులు, సిబ్బందితో స్థానిక స్త్రీశక్తి భవనంలో బుధవారం సమీక్ష నిర్వహించి, పలు సూచనలు చేశారు.

మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ పండుగలా నిర్వహించాలి

విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య ఓ ఆత్మీయ వారధి నిర్మించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టిందని, ఇందులో భాగంగా ఈ నెల 7న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌ను నిర్వహిస్తోందని, అన్నిపాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించాలని డీఈవో, మండల ప్రత్యేకాధికారి పీవీజే రామారావు సూచించారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మండలంలోని తొమ్మిది జడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశమైన ఆయన కార్యక్రమం విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఈ.సత్యకుమార్, తహసీల్దార్ జాలాది విమలకుమారి, డీవైఈవో (గుడివాడ)పద్మారాణి, డీసీఈబీ సెక్రటరీ జాన్ సాహెబ్, హౌసింగ్ ఏఈ మండవ సురేష్, గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల ఎంఈవోలు కొండా రవికుమార్, జె.సాంబశివరావు, ఆర్.కమల, రమా బాలసింగ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



టీసీఎస్‌కు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

టీసీఎస్‌కు వీఆర్ సిద్ధార్థ విద్యార్థుల ఎంపిక

పెనమలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఐటీ సేవలు, కన్సల్టింగ్‌లో గ్లోబల్ లీడర్ అయిన టీసీఎస్ తన తాజా రిక్రూట్‌మెంటు డ్రైవ్‌లో 343 మంది వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల (డీమ్డ్ టు బీ యూనివర్సిటీ) విద్యార్థులను ఎంపిక చేసినట్లు వీసీ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. రికార్డు స్థాయిలో ఎంపికైన 343 విద్యార్థుల్లో 54 మంది ఏడు లక్షల నుంచి తొమ్మిది లక్షల వేతనాన్ని సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ, ఈ అద్భుత విజయానికి తమ విద్యార్థులు, అధ్యాపక బృంద కృషి కారణమని తెలిపారు. యువ ఇంజనీర్ల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నందుకు టీసీఎస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పీ లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు రాజయ్యలు విద్యార్థులను అభినందించారు.

మినుములో పొగాకు లద్దె పురుగు

కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి

కంకిపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మినుముపైరులో పొగాకు లద్దెపురుగు ఉధృతి మధ్యస్తంగా ఉండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి అన్నారు. మండలంలోని దావులూరు గ్రామంలో బుధవారం ఆమె పర్యటించారు. మినుము పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ, చిరుజల్లులు కురవడం వల్ల ఈ పొగాకు లద్దె పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. మోతాదుకు మించకుండా పురుగు మందులు వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పామర్రు ఏడీఏ బి. స్వర్ణలత, మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఎం. కిరణ్, విఏఎలు, రైతులు పాల్గొన్నారు.

గోసాల, వణుకూరులో పొలం పిలుస్తోంది

పెనమలూరు : మండల వ్యవసాయాధికారిణి శైలజ ఆధ్వర్యంలో బుధవారం గోసాల, వణుకూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో శైలజ తన సిబ్బందితో కలిసి వణుకూరులో కోత, ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. కోతల గురించి, ధాన్యంలో తేమశాతం గురించి రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సిబ్బంది చాముండేశ్వరి, కిరణ్మయి పాల్గొన్నారు.

పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

గన్నవరం : రైతులు రబీకి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ఇన్సూరెన్స్ చేయించుకోవాలని జేడీఏ పద్మావతి అన్నారు. మండలంలోని ముస్తాబాదలో పొలం పిలుస్తుంది లో భాగంగా రైతు సేవా కేంద్రంలో రైతులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. మినుము, పెసర, మొక్క జొన్న రైతులు ఈ నెల 15వ తేదీలోపు ఇన్సూరెన్స్ చేసుకోవాలన్నారు. ఏడీఏ సునీల్, ఎంఏవో రజనీ వీఏఏలు పాల్గొన్నారు.



దావులూరులో మినుము పంటను పరిశీలిస్తున్న డాక్టర్ సుధారాణి

వంశీ అనుచరులకు షరతులతో బెయిల్

- వారంలో రెండు రోజులు కోర్టుకు హాజరు కావాలి
- కోర్టు పరిధిలోనే ఉండాలి
- ఏదైనా కేసు నమోదైతే బెయిల్ రద్దు

గన్నవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేత రంగబాబుపై దాడి ఘటనలో అరెస్టు అయ్యి 14రోజులు రిమాండ్ విధించగా నెల్లూరు జైల్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులకు మంగళవారం సాయంత్రం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. ఈ ఏడాది జనవరి 21న గన్నవరం విమానాశ్రయం పార్క్ ఎలైట్ హోటల్ వద్ద పొలం విషయమై మాట్లాడేందుకు రంగబాబును పిలిచి కొందరు వ్యక్తులు విచక్షణ రహితంగా దాడి చేసిన సంగతి తెలిసిందే. అప్పుడు రంగబాబు గన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వారిపై 326, 120 (బీ) రెడ్ విత్ 34 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ప్రధాన అనుచరులు ఓలుపల్లి మోహనరంగా, ఎంపీపీ అనగాని రవి, భీమవరపు యతేంద్ర రామకృష్ణ, మేచినేని బాబు, సూరపనేని అనిల్, గొన్నూరి సీమయ్య, గుర్రం నాని, కర్నాటి నిరంజన్‌లను ఈ నెల 19న అరెస్టు చేసి గన్నవరం కోర్టుకు హాజరుపరిచారు. జడ్జి వారికి 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితుల తరుపున న్యాయవాదులు బెయిల్ పిటీషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న జడ్జి 8 మందికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. వీళ్లు కోర్టు పరిధిలోనే ఉండాలని, వారంలో మంగళవారం, శుక్రవారం కోర్టుకు హాజరు కావాలని, నేరాలకు పాల్పడి కేసు నమోదైతే బెయిల్ పిటీషన్ కొట్టివేయబడుతుందని, అవసరమైనప్పుడు కేసు విచారణకు అందుబాటులో ఉండాలని ఆంక్షలతో కూడిన బెయిల్‌ను మంజూరు చేశారు.

యువతలో ఆధ్యాత్మిక భావజాలాన్ని

పెంపొందించడమే ఎస్ఎస్ఎఫ్ లక్ష్యం



పొణుకుమాడులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎస్ఎస్ఎఫ్ కార్యకర్తలు

ఉంగుటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : యువతలో ఆధ్యాత్మిక భావజాలాన్ని పెంపొందించడమే లక్ష్యంగా సమరసత సేవా ఫౌండేషన్(ఎస్ఎస్ఎఫ్)ఇంటింటా ధర్మ ప్రచారాన్ని నిర్వహిస్తోందని ఎస్ఎస్ఎఫ్ జిల్లా ధర్మ ప్రచారక్ జయశంకర్ అన్నారు. ఫౌండేషన్ ప్రారంభమై తొమ్మిదేళ్ల పూర్తయిన సందర్భంగా బుధవారం ఉంగుటూరు మండలం, పొణుకుమాడు రామాలయంలో ఘనంగా వసంత ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం హిందూ దేవాలయాల పరిరక్షణలో భాగంగా విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న కేసరపల్లిలో నిర్వహించే హైందవ శంఖారావంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ ఎస్ఎస్ఎఫ్ కార్యకర్తలు గ్రామంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యడవల్లి పాండురంగారావు, పడమట అర్జునరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

ఉయ్యూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో నేటి నుంచి ఈ నెల 19 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎం. సురేశ్‌కుమార్ తెలిపారు. 6న ఉదయం సాయిపురం, మధ్యాహ్నం జబర్లపూడి, 7న ఉదయం ముదునూరు, మధ్యాహ్నం బోళ్లపాడు, 12న ఉదయం కలవపాముల, మధ్యాహ్నం కాటూరు, 13న ఉదయం కడవకొల్లు, మధ్యాహ్నం వీరవల్లి మొఖాస, 17న ఉదయం పెదఓగిరాల, మధ్యాహ్నం చినఓగిరాల, 18న ఉదయం ఆకునూరు, మధ్యాహ్నం గండిగుంట, 19న ఉయ్యూరులో రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ తెలిపారు.

విడాకులు ఇవ్వకుండా మరో పెళ్లి .. కేసు నమోదు

పెనమలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భార్యకు విడాకులు ఇచ్చే సమయంలో ప్రతిగా కొంత సొమ్మును ఇస్తానని చెప్పి ఇవ్వకుండా, విడాకులు మంజూరు కాకుండానే మరో పెళ్లి చేసుకున్న వ్యక్తిపై అతని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యనమలకుదురుకు చెందిన అర్చన, నాగశ్రీనివాస్‌కు పదేళ్ల క్రితం వివాహమైంది. వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడిగా ఉంటున్నారు. కోర్టులో విడాకులు మంజూరు కాకుండానే గత ఆగస్టులో అతను మరో మహిళను వివాహం చేసుకొన్నాడు. విషయం తెలుసుకొన్న అర్చన పోలీసులకు ఫిర్యాదు చేసింది.


విజేతలతో ఏపీ ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ చెరుకూరి సత్యనారాయణ

ఉత్కంఠగా ఆర్చరీ పోటీలు

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శాతవాహన కళాశాల గ్రౌండ్స్‌లో రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలు రెండోరోజు ఉత్కంఠగా జరిగాయి. బుధవారం నాటి పోటీలను సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ప్రారంభించారు. రాష్ట్రంలో ఆర్చరీ క్రీడకు వన్నె తెచ్చిన ఏపీ ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ చెరుకూరి సత్యనారాయణకు ద్రోణాచార్య అవార్డు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కృష్ణాజిల్లా ఆర్చరీ అసోసియేషన్ కోశాధికారి జి.ప్రేమ్‌కుమార్, టెక్నికల్ కమిటీ చైర్మన్ బి.వెంకటరమణ పాల్గొన్నారు.

పురుషుల్లో బి బుద్ధేశ్వరరావు, డి జ్యోతి ప్రకాష్‌రెడ్డి, టి గణేష్ మణిరత్నం, బి రవితేజ, మహిళల్లో ఎం సూర్య హంసిని, బి షణ్ముక నాగసాయి, కె. శరణ్య, కె. సుస్మిత కాంపౌండ్ విజేతలుగా నిలిచారు.

8న ఉమ్మడి కృష్ణా హ్యాండ్‌బాల్ టీమ్ ఎంపిక

నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ నెల 8న సాయంత్రం 4 గంటలకు ఉమ్మడి కృష్ణా సీనియర్ బాలుర హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికను చేపడుతున్నట్టు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి ఎన్ వంశీకృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిని ఈ నెల 15, 16న అనంతపురం జిల్లా రాయదుర్గంలో జరిగే 9వ రాష్ట్రస్థాయి సీనియర్ బాలుర హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్‌కు పంపుతామన్నారు.

ప్రతిభ చాటే క్రీడాకారులకు అండగా శాప్: చైర్మన్

రాష్ట్రంలో రాణించే పేదింటి క్రీడాకారులకు శాప్ అండగా ఉంటుందని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు భరోసా ఇచ్చారు. విజయవాడకు చెందిన డిజేబుల్ చెస్ ప్లేయర్ కే వెంకట కృష్ణ కార్తీక్ కిర్గిస్థాన్‌లో ఇటీవల జరిగిన ఏషియన్ చెస్ చాంపియన్‌షిప్ సాధించాడు. కాకినాడకు చెందిన పవర్‌లిఫ్టర్ ఎం శ్రీనివాసరావు పంజాబ్ రాష్ట్రంలో జరిగిన 31వ ఆలిండియా నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం వశం చేసుకున్నాడు. వీరిద్దరూ వేర్వేరుగా శాప్ కార్యాలయంలో చైర్మన్ కలవగా, వారిని అభినందించి శాలువాతో సత్కరించారు.


కార్తీక్‌ను అభినందిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు, కోచ్ షేక్ ఖాసీమ్

జాతీయ క్రీడలకు తీసుకెళ్లే అనుమతి పురుషోత్తమ్‌కు లేదు!

ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ క్రీడలకు క్రీడాకారులను తీసుకెళ్లేందుకు ఆర్‌కే పురుషోత్తమ్‌కు అనుమతి లేదని, అతడి గ్రూపులోని సభ్యులు హోదాల్లో పాల్గొనడానికి అర్హులు కారని ఏపీవోఏ సెక్రటరీ కేపీ రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము ఏపీలో 47ఏళ్లుగా క్రీడా సేవలందిస్తున్నామని, కబడ్డీని ఆసియా స్థాయి కార్యకలాపాలకు ప్రోత్సహించామన్నారు. ఐవోఏ వెబ్‌సైట్‌లో ఏపీవోఏ ప్రత్యర్థి గ్రూప్ అధ్యక్షుడిగా మాజీ మంత్రి కృష్ణదాస్ పేరు ప్రదర్శించబడిందని రావు తెలిపారు. 2023లో రూ.25లక్షలు ఖర్చులు పెట్టి ఏపీ జట్లను తీసుకెళతానని హైకోర్టులో చెప్పి ఆర్డర్ తీసుకుని, ఇప్పుడు హైకోర్టును మోసం చేస్తూ ఆర్‌కే పురుషోత్తమ్ ఇచ్చిన తప్పుడు ప్రకటన ఎలా ఇస్తారని ప్రశ్నించారు. నాపైన లేదా మా గ్రూప్‌నకు వ్యతిరేకంగా తప్పుడు, నకిలీ ప్రకటనలిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. జాతీయ సమాఖ్యల నుంచి గుర్తింపు లేఖలతో మీడియా ముందు ఈ మెజార్టీని ఎప్పుడైనా, ఎక్కడైనా నిరూపిస్తానని పురుషోత్తమ్‌కు సవాల్ చేశారు.


ఎంపికైన జట్టుతో శ్రీదేవి, రఘురామ్

సౌత్‌జోన్ వర్శిటీ టోర్నీకి కృష్ణా టీమ్

విశాఖపట్నం గీతం వర్శిటీలో ఈ నెల 5 నుంచి 8వ వరకు జరిగే సౌత్‌జోన్ ఇంటర్ వర్శిటీ మహిళా చెస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే కృష్ణా వర్శిటీ టీమ్ అక్కడకు పయనమైందని సప్తగిరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, చైర్‌పర్సన్ డాక్టర్ పీడీవీ శ్రీదేవి, ఫిజికల్ డైరెక్టర్ ఆర్ రఘురామ్ ఒక ప్రకటనలో తెలిపారు. కె.హైందవి శర్వాణీ (ఎస్‌వీడీ సిద్ధార్థ లా కళాశాల), ఏ ఉషా ప్రవల్లిక, ఎస్ సాధన, (పీబీ సిద్ధార్థ కళాశాల), ఎన్ నవ్య (ఎస్‌డీఎంఎస్) ఏ బిందుమాధవి (కేబీఎన్), ఏ దివ్యరేఖ (ఏజీఎస్‌జీ సిద్ధార్థ) క్రీడాకారిణులు తలపడుతున్నారన్నారు. జట్టుకు మేనేజర్ బీ శ్రావణి వ్యవహరిస్తారన్నారు.



టేబుల్ టెన్నిస్ ప్లేయర్స్‌ను అభినందిస్తున్న డీఎస్‌డీవో

జాతీయ టీటీకి పలువురు ఎంపిక

ఎన్టీఆర్ జిల్లా డీఎస్ఏ టేబుల్ టెన్నిస్ కోచ్ ఎస్‌కే ముంతాజ్ బేగం వద్ద శిక్షణ పొందుతున్న జె.సుభాష్ బాబు, పి.లాస్య, ఎస్‌కే అబ్దుల్ రియాన్, ఎం సునీత ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ నేషనల్స్ సీబీఎస్ఈ, జేఎన్‌టీయూకేల్లో జరిగే పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్ ఈ నలుగురు క్రీడాకారులను, కోచ్‌ను ప్రత్యేకంగా బుధవారం అభినందించారు.

పాకిస్తాన్

పేరు మార్చండి మహాప్రభో..!

- నగరంలో పొరుగు దేశం పేరుతో కాలనీ
- ఆధార్, రేషన్, పాన్ కార్డుల్లోనూ అదే పేరు
- ఉద్యోగాలు, లోన్లు, పాస్‌పోర్ట్ విషయంలో తీవ్ర ఇబ్బందులు
- 3 దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు
- శత్రుదేశం పేరు చెప్పుకోలేకపోతున్నామంటూ ఆవేదన
- భగీరథ కాలనీగా పేరు మార్చాలని వేడుకోలు





ఎవరైనా తాముండే కాలనీ, ప్రాంతం పేరు ఏదైనా తమ కాలనీ పేరు అక్కడి వాసులు గొప్పగా చెప్పుకుంటారు. ఫలానా కాలనీ వాసులమని గర్వంగా ఫీలవుతారు. అయితే నగరంలోని ఓ కాలనీవాసులు తమ కాలనీ పేరు చెప్పుకోవడానికి ఇష్టపడరు. తాముంటున్న కాలనీ పేరు చెప్పకుండా ఫలానా ప్రాంతం పక్కన అనో ఫలానా రోడ్డుకు దగ్గర్లో అనో చెప్పుకుంటారు. అంతే కాదు తమ కాలనీ పేరును మార్చండి మహాప్రభో అంటూ దండాలు పెట్టేస్తారు. ఆఖరికి తమ పిల్లలకు పెళ్లి సంబంధాలు వెళ్లిన సమయంలో అసలు తమ కాలనీ పేరే చెప్పుకోరు. ఇంతకీ అక్కడి వారు చెప్పుకోలేనంతగా ఆ పేరులో ఏముందో తెలుసా మన శత్రుదేశమైన 'పాకిస్తాన్' అవును నిజమే. పాకిస్తాన్ పేరుతో నగరంలో ఓ కాలనీ ఉంది. అది పాయకాపురం ప్రాంతంలోని నున్న రూరల్ పోలీసు స్టేషన్ వెనుకే ఉంది.

– పాయకాపురం, ఆంధ్రజ్యోతి

ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య 1971 యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో భారత్ విజయం సాధించగా అదే సమయంలో పాకిస్తాన్ నుంచి బంగ్లాదేశ్ విభజించబడింది. దీంతో పాక్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని అనేక కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. అప్పటి ప్రభుత్వం ఆయా కుటుంబాలకు భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో ఆశ్రయం కల్పించారు. అందులో భాగంగా నగరంలోని పాయకాపురం ప్రాంతంలో ఓ చిన్నిపాటి కాలనీ నిర్మించారు. 1984లో 40గృహాలు 3 రోడ్లతో నిర్మించిన కాలనీ 1986లో పూర్తయింది. అప్పట్లో కాలనీకి పాకిస్తాన్ కాలనీగా నామకరణం జరిగింది. అయితే పాకిస్తాన్ సరిహద్దుల నుంచి ఏ ఒక్క కుటుంబం ఇక్కడికి వచ్చి నివాసం ఉండలేదు. దీంతో కాలనీ దెబ్బతిని నిర్మానుష్యంగా మిగిలిపోయింది. 3దశాబ్దాల క్రితం పాయకాపురం ప్రాంతాన్ని బుడమేరు వరదలు ముంచెత్తాయి. ఆ సమయంలో అనేక మంది స్థానికులు నిరాశ్రయులయ్యారు. ఇక ఇళ్లు లేక రోడ్ల పక్కన జీవనం సాగించే కుటుంబాలు మనుగడ సాగించడమే కష్టమయిపోయింది. అయితే అప్పట్లో సమీప ప్రాంతాల కన్నా పాకిస్తాన్ కాలనీ కాస్త ఎత్తులో ఉండి వరద ముంపు ప్రభావం తక్కువగా ఉంది. దీంతో అప్పటి అధికారులు పలు కుటుంబాలను కాలనీలోని ఇళ్లకు తరలించారు. అప్పటి నుంచి వారంతా ఆ కాలనీవాసులుగానే ఉండిపోయారు. ప్రస్తుతం పాకిస్తాన్ కాలనీలో 58 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి.

ఉద్యోగాలు, లోన్లు, పాస్‌పోర్టు విషయంలో ఇబ్బందులు

కాలనీలో గతంతో పోలిస్తే ఇప్పుడు ప్రజలు కొంత అభివృద్ధి చెందారు. అయితే ఉద్యోగాలకు, లోన్లకు, పాస్‌పోర్ట్ వంటి విషయాల్లో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కుంటున్నారు. ఎక్కడికి వెళ్లినా తమ ఆధార్ కార్డులు, పాన్‌కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర గుర్తింపు కార్డుల్లో పాకిస్తాన్ ఉండటం శాపంగా మారింది. విదేశాలు వెళ్లాలనుకునే వారికి ఎయిర్‌పోర్ట్‌లో అనేక చిక్కులు ఎదురవుతున్నాయి. ఇక ప్రైవేట్ ఉద్యోగాలకు వెళ్లే యువకుల ఆధార్ కార్డుల్లో పాకిస్తాన్ పేరుండటంతో ఉద్యోగాలు రాని పరిస్థితి నెలకొంది.



భగీరథ కాలనీగా నామకరణం చేయాలి

ఏకతాటిపైకి వచ్చిన కాలనీవాసులంతా కొన్నేళ్లుగా తమ కాలనీకి భగీరథ కాలనీగా నామకరణం చేయాలని కోరుతున్నారు. అలాగే తమ ఇంటి పన్నులు, ఆధార్ కార్డులు, కరెంట్ బిల్లులతో పాటుగా సమస్త గుర్తింపు కార్డుల నుంచి పాకిస్తాన్ పేరును తొలగించి భగీరథ కాలనీగా ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేయాలని వేడుకుంటున్నారు.

గ్రామానికిచ్చిన భూమిలో పనులు నిలిపేయండి

- అధికారులపై గ్రామస్థుల ఆగ్రహం
- ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు హామీ ఇచ్చినా పట్టించుకోవట్లేదని ఆరోపణ

హనుమాన్‌జంక్షన్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మల్లవల్లి గ్రామ అవసరాలకు కేటాయించిన భూమిలో హైస్కూల్ నిర్మాణం జరుగుతున్నా అధికారులు అత్యుత్సాహంతో తమను రెచ్చగొట్టేందుకే పారిశ్రామిక అవసరాలంటూ భూమి చదును చేస్తున్నారని, ఎమ్మెల్యే హామీ ఇచ్చినా అధికారుల వినట్లేదని మల్లవల్లి గ్రామస్థులు ఆలూరి సురేష్, కాసులు తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లవల్లిలో ఆర్.ఎస్.నెం 11లో గ్రామ అవసరాలకు కేటాయించిన 100 ఎకరాల భూమిలో పనులు చేసేందుకు వచ్చిన జేసీబీని బుధవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలోనే పారిశ్రామికవాడకు 1360 ఎకరాలు, గ్రామ అవసరాలకు 100 ఎకరాలు కేటాయించినట్లు ఉత్తర్వుల కాపీని చూపిస్తున్నారు. అయితే అందులో భూమి ఎక్కడ కేటాయించిందనేది లేదని అధికారులు సంబంధింత ప్రతాలు పరిశీలిస్తే తెలుస్తుందని చెబుతున్నారు. దీనిపై కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లామని, ఉన్నతాధికారులతో పాటు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హామీ ఇచ్చినా కేవలం గ్రామస్థులను రెచ్చగొట్టేందుకే ఈ భూమిలోనే పనులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత ఎఫ్ఎంబీ లేదా రెవెన్యూ రికార్డులు పరిశీలిస్తే సమస్య ఎక్కడుందో తెలుస్తుందని, కానీ అధికారులు మాత్రం పాత రికార్డులు తీసేందుకు అంగీకరించకపోగా గ్రామానికి కేటాయించిన భూమిని కలుపుకోవడం అన్యాయమన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హామీ మేరకు తాము ఇప్పటి వరకు మాట్లాడకుండా ఉన్నామని, సమస్య క్షేత్రస్థాయిలో పరిష్కారమయ్యే వరకూ గ్రామానికి కేటాయించిన భూమిలో పనులు చేపడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని గ్రామస్థులు హెచ్చరించారు.


పనులను అడ్డుకుంటున్న మల్లవల్లి గ్రామస్థులు

ఏపీఐఐసీ భూమిలోనే హైస్కూల్ కేటాయింపులు

హైస్కూల్ నిర్మించేందుకు నిధుల విడుదలకు ఏపీఐఐసీకి చెందిన భూమిలోనే గతంలో కేటాయింపులు జరిగాయని, మిగిలిన భూమి పారిశ్రామికవాడకు చెందినదేనని ఏపీఐఐసీ అధికారులు తెలిపారు. జోనల్ మేనేజర్ బాబ్జీ ఫోన్‌లో అందుబాటులో లేని కారణంగా తాము చెబుతున్నామన్నారు. హైస్కూల్‌కు 5 ఎకరాలు, పీహెచ్‌సీ లాంటి గ్రామ ప్రజలకు ఉపయోగపడే భవనాల నిర్మాణానికి 13 ఎకరాలు మొత్తం 18 ఎకరాలు భూమి కేటాయించగా, మిగిలిన భూమిలోనే పనులు చేస్తున్నారన్నారు. గ్రామావసరాలకు అవసరమైన భూమిలో పనులు చేయట్లేదని, మిగిలిన 82 ఎకరాల భూమిని మాత్రమే పారిశ్రామిక అవసరాలకు వినియోగించేందుకు చదును చేస్తున్నామని అధికారులు వివరించారు.

4.2 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యం స్వాధీనం

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొండపల్లిలో ఓ వాహనంలో 4.2 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసుకుంటున్న వాహనంతో పాటు నిందితుడ్ని బుధవారం పౌరసరఫరాలు, రెవెన్యూశాఖాధికారులు పట్టుకున్నారు. పీడీఎస్ డీటీ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కొండపల్లికి చెందిన సయ్యద్‌ఖాజా అనే వ్యక్తి పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్టు తెలిపారు. బియ్యాన్ని స్టేషన్‌కు తలరించి 6ఏ కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్టు తెలిపారు.


పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న పీడీఎస్ డీటీ రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

రైతుల ఖాతాల్లో రూ.280 కోట్లు జమ

- రూ. 2.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బంది లేకుండా చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఆబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం కలెక్టరేట్ మీ కోసం సమావేశపు హాలులో మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ధాన్యం సేకరణ, రైతు సమస్యలపై మంత్రి సమీక్షించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. వాతావరణ మార్పుల వల్ల ధాన్యం సేకరణకు సంబంధించి రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయన్నారు. జిల్లాలో ఈ ఏడాది ధాన్యం దిగుబడి అంచనా 9 లక్షల 79వేల మెట్రిక్ టన్నులు కాగా దీనిలో స్థానికుల వినియోగం పోనూ 5లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు సిద్ధం చేశారన్నారు. ప్రతి ఏడాది నవంబర్ నెలలో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగేదని, అయితే ఈ నవంబరులో లక్షా 53 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందన్నారు. ఈనెల 7న ముఖ్యమంత్రి చంద్రబాబు పెనమలూరు మండలం కానూరు గ్రామంలో మురళీ రిసార్ట్స్‌లో ఉర్జవీర్‌ను ప్రారంభిస్తారని, పకడ్బందీగా ఏర్పాట్లు నిర్వహించాలని కోరారు. కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖర్, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, ఆర్డీవోలు కె.స్వాతి, బాలసుబ్రహ్మణ్యం, షారోన్, విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యానందం పాల్గొన్నారు.






ఆర్ట్ డైరెక్టర్, టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు ఆనందసాయికి చిత్రపటం అందజేస్తున్న డిప్యూటీ ఈవో రత్నరాజు, దుర్గగుడి కళావేదికపై భక్తిసంగీత కార్యక్రమంలో కీర్తనలు పాడుతున్న కళాకారుడు డాక్టర్ ఆకురాతి కోదండరామయ్య

దుర్గమ్మ సన్నిధిలో టీటీడీ బోర్డు సభ్యుడు ఆనందసాయి

వన్‌టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు, ప్రముఖ సినీ ఆర్ట్ డైరెక్టర్ ఆనందసాయి బుధవారం కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అధికారు లు ఆయనకు స్వాగతం పలికి ఆలయ మర్యాదలు అంద జేశారు. అమ్మవారి దర్శనం తరువాత డిప్యూటీ ఈవో రత్నరాజు ఆయనకు చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేయగా వేద పండితులు వేద ఆశీస్సులు అందజేశారు.

దుర్గగుడి కళావేదికపై భక్తిసంగీతం

దుర్గగుడి కళావేదికపై బుధవారం భక్తి సంగీతం నిర్వహించారు. విజయవాడకు చెందిన గాయకుడు డాక్టర్ ఆకురాతి కోదండ రామయ్య పలు కీర్తనలను హృద్యంగా ఆలపించారు. అమ్మవారి, స్వామివారి కీర్తనలతో పాటు, వినాయకుడు, విష్ణుమూర్తి కీర్తనలు చక్కగా ఆలపించి, భక్తుల కరతాళధ్వానాలు అందుకున్నారు. వయోలిన్ పాలపర్తి ఆంజనేయ శాస్త్రి, మృదంగంతో జగన్మోహిణిలు సహకరించారు. కళాకారులను డిప్యూటీ ఈవో రత్నరాజు అభినందించి, ప్రశంసా పత్రాలు, చిత్రపటం అందజేశారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ గంగాధరరావు

సైబర్ నేరాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి

- కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధరరావు

ఉంగుటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలకు అవకాశం ఇవ్వకుండా అవగాహన సదస్సులు విస్తృతం చేయాలని, మహిళలపై జరుగుతున్న నేరాల అదుపునకు విద్యాలయాల వద్ద కొత్తగా మహిళా కానిస్టేబుళ్లతో ఏర్పాటు చేసిన శక్తిటీమ్‌ల ద్వారా ప్రత్యేక నిఘా ఉంచాలని కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం మండలంలోని ఆత్కూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. తొలుత సిబ్బంది చేత గౌరవ వందనం అందుకున్న ఆయన పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి వారి యోగక్షేమాలను ఆరా తీశారు. స్టేషన్లో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పెండింగ్ కేసుల ఫైళ్లను స్వయంగా పరిశీలించి వాటి పురోగతిపై సమీక్షించిన ఆయన త్వరగా చార్జిషీట్ ఫైల్ చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఎస్సై సురేష్‌కు సూచనలు చేశారు. నేషనల్ హైవేపై రోడ్డు ప్రమాదాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఎక్కువగా ప్రమాదాలకు కారణమౌతున్న రాంగ్ పార్కింగ్‌లు, డ్రంక్ అండ్ డ్రైవింగ్‌ను అదుపుచేయాలని ఆదేశించారు. గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, హనుమాన్‌జంక్షన్ సీఐ కేవీవీఎస్ సత్యనారాయణ, ఆత్కూరు ఎస్సై చావా సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వెబ్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణ

కృష్ణలంక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నందు అర్హత కలిగిన అభ్యర్థులకు వెబ్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిప్లొమో, ఏదైనా డిగ్రీ, ఆపైన అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రత్యేకంగా 3 నెలల పాటు వెబ్ డెవలపర్ కోర్సుకు ఉచిత శిక్షణ డిసెంబరు 10లోగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఈ వెబ్ డెవలపర్ కోర్సుకు ఎంపికైన విద్యార్థులకు ఈ కోర్సులో నూతన సాంకేతికతో కూడిన పరిజ్ఞానంతో ప్రత్యేక శిక్షణ సౌకర్యం కల్పిస్తామని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డా.విజయసారథి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాస్ తెలిపారు. శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగి, అర్హత ఉన్న నిరుద్యోగ యువత డిసెంబరు 10లోపు నమోదు చేసుకోవాలని, కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందచేస్తామన్నారు. ఇందులో భాగంగా అభ్యర్థులు ఇంటర్, డిగ్రీ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, ఈ మెయిల్ ఐడీ, మొబైల్ నెంబరుతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, విజయవాడ నందు ఉదయం 10 గంటల నుంచి సంప్రదించవచ్చన్నారు. వివరాలకు 9347779032, 9391254464 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఉమ్మడి కృష్ణాజిల్లా విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణరెడ్డి మృతి



మొగల్రాజపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా జిల్లా విశ్రాంత న్యాయమూర్తి దుగ్గిరాల సత్యన్నారాయణరెడ్డి (85) జయప్రకాష్ నగర్‌లో ఆయన స్వగృహంలో బుధవారం మృతి చెందారు. ఆయనకు నగర ప్రాంతంలో ప్రగతి శీల ప్రజాస్వామ్య ఉద్యమాలతో అనుబంధం ఉంది. గుంటూరు జిల్లా గురజాల మండలం అంబాపురంలో జన్మించిన ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. పదవీ విరమణ తరువాత హక్కుల ఉద్యమాలు ఇస్కఫ్, శాంతి స్నేహ ఉద్యమంలో చురుగ్గా పాల్గొనేవారు. పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా, వినియోగదారుల కోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన న్యాయమూర్తిగా ఉన్నపుడు లోక్ అదాలత్‌లో ఒక్కరోజే 350 కేసులు పరిష్కరించారు. ఆయన మరణవార్త తెలిసిన వామపక్ష న్యాయవాదులు, సాహితీ వేత్తలు సందర్శించి నివాళులర్పించారు. పెన్షనర్స్ అసోసియేషన్ నేతలు దాలినాయుడు, నరసింహారెడ్డి, బ్రహ్మం, సాహితీప్రముఖులు తాటి శ్రీకృష్ణ, గోళ్ల నారాయణరావు, లక్ష్మయ్య, మోతుకూరి వెంకటేశ్వరరావు, అరుణ్‌కుమార్, ఎంఎల్ నేతలు వీరబాబు, రఘు, జగన్, ఎంవీ ఆంజనేయులు నివాళులర్పించారు.

ఏపీలో 23 గతిశక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినళ్లు

వన్‌టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైల్వేశాఖ దేశంలో కార్గో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడానికి తీసుకువచ్చిన గతిశక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినళ్ల విధానంలో ఏపీలో 23 ప్రాంతాలున్నాయని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ లోక్‌సభలో బుధవారం లిఖితపూర్వకంగా తెలియజేశారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, మరో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు. పారిశ్రామిక అవసరాలతో పాటు కార్గో రవాణా అవకాశాలను పెంచటానికి టెర్మినళ్లు ఉపయోగపడతాయన్నారు. ఈ ఏడాది అక్టోబరు 31 వరకు 91 టెర్మినళ్లను ప్రారంభించారని, ఇందులో 4 ఏపీలో ఉన్నాయన్నారు. దీని ప్రకారం ఈ టెర్మినళ్లను అనుమతి లభించిన రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ప్రైవేటు, ప్రభుత్వ రంగాల నిధులతో ఈ ప్రాజెక్టులు అమలవుతాయన్నారు. పారిశ్రామిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని టెర్మినళ్ల ఏర్పాటు జరుగుతుందని తెలిపారు.

దేశంలో 15 వరద వాతావరణ కేంద్రాలు

ఎంపీలు అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర శాస్త్ర సాంకేతిక భూవిజ్ఞాన సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ లిఖిత పూర్వక సమాధానం ఇస్తూ దేశంలో 15 వరద వాతావరణ కేంద్రాలున్నాయని, కొత్త కేంద్రాన్ని సిమ్లాలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కేంద్రాలు వాతావరణ ఉపగ్రహాలు, రాడార్‌ల సహాయంతో వర్షపాతాన్ని అంచనాలు వేస్తాయని, ఈ సమాచారంతో కేంద్ర జల కమిషన్ హెచ్చరికలను ముందుగానే జారీ చేస్తుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు క్వాంటిటేటివ్ ప్రిసిపిటేషన్ ఫోర్‌కాస్ట్ బులిటెన్లను విడుదల చేస్తుందన్నారు. తాజాగా హిమాచలప్రదేశ్‌లోని సిమ్లాలో వరద వాతావరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వాతావరణ శాఖ నిర్ణయించిందన్నారు. బియాస్ నది, సట్లెజ్‌నది, రంజిత్ సాగర్ డ్యామ్‌కు సంబంధించి కేంద్రం బులిటెన్లు జారీ చేస్తుందన్నారు.

విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ

గుడ్లవల్లేరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో విన్నకోట, వడ్లమన్నాడు గ్రామాల్లో జిల్లాపరిషత్ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఇటీవల ఆ పాఠశాలల్లో విద్యార్థులకు నేత్రవైద్య పరీక్షలు నిర్వహించారు. లయన్స్ జిల్లా 316డి వైస్ గవర్నర్ వి.వి.పి.ఎస్. అంజనేయులుచే పంపిణీ నిర్వహించారు. కార్యక్రమానికి దాతలుగా నర్రా గంగాధరరావు, నిర్మలకుమారి(వెస్ట్‌ఇండీస్) దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఎస్.శశికళ, లయన్స్ మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్, మూల్పూరి సుధాకర్, సూరపనేని పరంధామయ్య, పెన్నేరు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.


కళ్లజోళ్లు పంపిణీ చేసిన లయన్స్ ప్రతినిధులు

టిడ్కో కాలనీలో ఆక్రమణలు షురూ

● లారీ స్టాండ్‌ల్లా మారిన కాలనీ రహదారుల ● బిల్డింగ్‌ల ఎదుట స్థలాలు కబ్జా

గుడివాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : 8912 గృహాలతో గుడివాడ టిడ్కో కాలనీ పేరుకే రాష్ట్రంలో అతి పెద్ద కాలనీ. కనీసం మౌలిక వసతులు కల్పించకుండా గత వైసీపీ ప్రభుత్వం ఇళ్లను లబ్దిదారులకు అందించింది. ఎన్నో ఆశలతో కాలనీలో అడుగుపెట్టిన వారికి నిరాశే ఎదురైంది. ఆనాటి మొదలు నేటికి సగం కుటుంబాలు వలస వెళ్లిపోయాయి.

గుడివాడ మండలం మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీలో యథేచ్ఛగా ఆక్రమణలు చోటుచేసుకుంటున్నాయి. జీ ప్లస్ త్రీ భవనాల ఎదుట ఉన్న ఖాళీ స్థలాలను ఇష్టానుసారంగా బడ్డీలు, ఇతర వ్యాపారాల పేరుతో కనీసం గృహాల్లోకి వెళ్లేందుకు వీలు లేకుండా ఆక్రమణలు చేపట్టారు. దీనికి తోడు బడ్డీ కొట్లు వద్ద ఆకతాయి చేరి వేధింపులకు గురిచేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి అయితే కాలనీలో గంజాయి బ్యాచ్ ఆగడాలకు అంతే లేకుండాపోయింది.

ఇష్టానుసారంగా నిలిపి ఉంచుతున్న లారీలు

టిడ్కో కాలనీ రహదారుల్లో ఇష్టానుసారంగా లారీలను ంచడంతో లారీస్టాండ్‌ను తలపిస్తోంది. రహదారులు కుచించుకుపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.


టిడ్కో కాలనీలో ఆక్రమణలు


రోడ్డుపై నిలిపి ఉంచిన లారీలు

ఎమ్మెల్యే వెనిగండ్ల అసెంబ్లీలో ప్రస్తావన

టిడ్కో కాలనీవాసుల దుస్థితిని రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చిత్రాలతో ప్రస్తావించారు. కనీసం మౌలిక వసతులు కల్పించాలని కోరారు. హడ్కో రుణం తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టిడ్కో కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు.

ఎమ్మెల్యే వెనిగండ్ల.. దృష్టి సారించండి

రెరా చట్టం ప్రకారం ఆర్‌డబ్ల్యూఏ(నివాసుల సంక్షేమ సంఘం) ఏర్పాటు చేయలేదు. ఎమ్మెల్యే వెనిగండ్ల దృష్టి సారించి టిడ్కో కాలనీలో పోలీస్ స్టేషన్, పాఠశాలలు, పార్కులు, ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఆక్రమణలు తొలగించాలని, లారీల నిలుపుదలను నివారించేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

గుడ్లవల్లేరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ నిధులతో గ్రామల్లో సీసీ రోడ్లకు శ్రీకారం చుట్టారని కూరాడ టీడీపీ నాయకులు కల్యాణపు నవాబు అన్నారు. బుధవారం కూరాడ గ్రామంలోని దళిత వాడలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను టీడీపీ నాయకులు పరిశీలించారు. నాల్గు రోడ్లకు ఇప్పటికి ఒకటి పూర్తికాగా, రెండు రోడ్లకు పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఆ పనులను టీడీపీ నాయకులు నవాబు, సాయిన శ్రీహరి పరిశీలించారు.

ప్రతి గింజా కొనుగోలు చేయాలి

పెదపారుపూడి: ఖరీఫ్‌లో రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మిల్లర్లను ఆదేశించినట్లు టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ ఇది రైతుల ప్రభుత్వమని, అందుకే ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో నగదు జమ చేస్తున్నట్లు వివరించారు. వాతావరణం మార్పు వల్ల రైతులు ఇబ్బందులు పడకుండా రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే రైసు మిల్లర్లతో మాట్లాడి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఆదేశించారని వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ప్రభుత్వం చూస్తుందని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

గుడివాడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మజ్జాడ నాగరాజు అన్నారు. బుధవారం స్థానిక కైకాల కళాభవనంలో మెప్మా ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మజ్జాడ మాట్లాడుతూ దివ్యాంగులు ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఎంఎం బసవేశ్వరరావు, సి.వోలు విజయకుమారి, బీబీ జాన్, పరిపూన్, కృష్ణకుమారి, రవి, ఆర్పీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పాత పద్ధతుల్లోనే ధాన్యాన్ని మిల్లులకు పంపండి

● ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి

గుడివాడ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం తగ్గినందున రైతులు తమ ధాన్యాన్ని పాత పద్ధతుల్లోనే మిల్లులకు పంపించాలని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి సూచించారు. బుధవారం లింగవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏడీఏ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారానే తమ ధాన్యాన్ని మిల్లులకు పంపాలని తెలిపారు. ఆఫ్‌లైన్ ద్వారా అమ్మితే తర్వాత రైతులు ఇబ్బందులు పడతారని తెలిపారు. మండల వ్యవసాయ అధికారిణి బోలెం అనంతలక్ష్మి మాట్లాడుతూ రబీ పంట నమోదు కార్యక్రమం ప్రారంభమైందని, రైతులు ఈ విషయాన్ని గమనించి రబీ పంట నమోదును రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతులు తొందరపడి పచ్చి ధాన్యాన్ని కోయవద్దని తెలిపారు. ఎటువంటి ఇబ్బంది ఉన్నా మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మండల విస్తరణాధికారిణి వి.అనిత, టీడీపీ నాయకులు గాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, లింగవరం రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న రమాదేవి

ట్రక్కు షీట్‌లు పెండింగ్ లేకుండా చూడండి

గుడివాడ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని రైసు మిల్లులకు చేర్చటానికి శాయశక్తులా కృషి చేస్తున్నట్లు తహసీల్దార్ రామకోటేశ్వరరావు తెలిపారు. మల్లాయపాలెంలో ఉన్న వెంకటపద్మావతి, శ్యామలాంబ, కల్వపూడి అగ్రహారంలోని శ్రీ శ్రీనివాస ట్రేడర్స్, రామన్నపూడిలోని రాజ్యలక్ష్మి రైసుమిల్లులను పరిశీలించారు. ట్రక్కు షీట్‌లు పెండింగ్ లేకుండా చూడాలని రైసుమిల్లు యజమానులను కోరారు. గత నెలలో ట్రక్కు షీట్‌లు ఏమైనా పెండింగ్‌లో ఉంటే క్లోజ్ చేయాలన్నారు. అడిగిన రైతులందరికీ గన్ని బ్యాగులు సరఫరా చేయాలన్నారు. రైసుమిల్లుల యజమానులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తాము పరిష్కరిస్తామన్నారు. మండలంలో ధాన్యంలో తేమశాతం తగ్గించే రైసుమిల్లులు అయిదే ఉన్నాయని తెలిపారు. వీటికి ఎక్కువగా ధాన్యం పంపుతున్నట్లు తెలిపారు. రైతులు అధైర్య పడవద్దని, ప్రతీ రోజు రైసుమిల్లుల యజమానులతో ఎంత ధాన్యం వచ్చింది, ఎంత పెండింగ్ ఉందో తెలుసుకుంటున్నామన్నారు. ఆర్ఐ నాగబాబు, రెవెన్యూ సిబ్బంది, పీడీఎస్ డిటి కిరణ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రామకోటేశ్వరరావు

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

పామర్రు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు, భూ యజమానులు భూములకు సంబంధించి ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార సాధన కోసం ఈనెల 6నుంచి జనవరి 8 వరకు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు పామర్రు తహసీల్దార్ గూడపాటి రవికాంత్ బుధవారం ఆయన కార్యాలయంలో తెలిపారు. మండలవ్యాప్తంగా తహసీల్దార్ ఆధ్వర్యంలో ఒకబృందం, డిప్యూటీ తహసీల్దార్ నేతృత్వంలో మరో బృందం ద్వారా గ్రామాల్లో భూసంబంధిత సమస్యలపై యజమానులు, రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తారమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిటి రజనీకాంత్, సీనియర్ సహాయకుడు జి అనినయ్య, ఏఎస్‌ఓ సుప్రియ, వీఆర్వోలు పాల్గొన్నారు.

పెదపారుపూడి: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ రెవెన్యూ సదస్సులు ఈ నెల 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మండల తహసీల్దార్ వై.రంగారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలకు సంబంధిత అధికారులు పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు.


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనిల్ కుమార్

కైలే పరామర్శ

పెదపారుపూడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అప్పికట్ల గ్రామం వైస్ సర్పంచ్, వైసీపీ వీరాభిమాని జుజ్జువరపు కోటేశ్వరరావు కొద్ది రోజులు క్రితం అనారోగ్యంతో మరణించారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి వారి కుటుంబసభ్యులను పరామర్శించి, కోటేశ్వరరావు మృతి పట్ల సానుభూతి తెలిపి కుటుంబానికి తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, సర్పంచ్ గోళ్ల సోమేశ్వరరావు, ఆల రమేష్, లంకపల్లి రాజేష్, జాజిల చిన్నారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేలకొరిగిన వరి చేలు .. రైతుల అవస్థలు

కూచిపూడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలు, గాలులకు పలు గ్రామాల్లో వరి చేలు నేలకొరిగాయి. మరో వారం పది రోజుల్లో గింజ పూర్తిగా తయారై కోతలకు సిద్ధమయ్యే తరుణంలో వరి చేలు నేలకొరగటంతో రైతులు అవస్థలు అన్నీ ఇన్నీ కాకుండాపోయాయి. మండలంలో ఈ ఏడాది 11 వేల హెక్టార్లలో వరి సాగు చేయగా, ఇప్పటి వరకు 40 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. పది శాతం వరకు పంట నేలకొరిగి రైతులకు నష్టాన్ని మిగిల్చింది. ఈ పంటను రక్షించుకోవటం రైతులకు తలకు మించిన భారంగా మారింది. వ్యవసాయ ఖర్చులు కూడా అధికంగా అవుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నముత్తేవి, కారకంపాడు, పెదపూడి, కూచిపూడి, నిడుమోలు, మొవ్వ, కాజ, కోసూరు తదితర గ్రామాల్లో గాలులకు వరి పంట నేలకొరిగింది. వరి దుబ్బులను పైకి లేపి కట్టి చేలల్లో నీటిని బయటకు మళ్లించాలని, పనల మీద ఉన్న ధాన్యం రంగు మారకుండా ఉప్పు ద్రావకాన్ని పిచికారి చేయాలని వ్యవసాయ శాఖాధికారులు రైతులకు సూచిస్తున్నారు. బుధవారం పలు గ్రామాల్లో చిరుజల్లులు కురవటంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు.


కూచిపూడిలో నేలకొరిగిన వరి పొలాలు

ఘనంగా ఘంటసాల జయంతి ఉత్సవాలు

గుడివాడ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చౌటపల్లి గ్రామంలో ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు పసుపులేటి శ్రీనివాసరావు, రిటైర్డ్ వీఆర్వో అట్లూరి గాంధీ, ఘంటసాల మనుమడు ఘంటసాల సుబ్రహ్మణ్యం తదితరుల ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఘంటసాల గేయాలు పాడారు. ఘంటసాల ఔన్నత్యాన్ని గ్రామస్థులకు వివరించారు.

గుడివాడ: అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి వేడుకలను బుధవారం స్థానిక సుందరయ్యభవన్‌లో ఘనంగా నిర్వహించారు. తొలుత ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఘంటసాల గానలహరి కార్యక్రమాన్ని నిర్వహించారు. గాయనీ, గాయకులు పి.శ్రీనివాసరావు, వి.జాన్, కె.సుకన్య, బి.నవీనలు ఘంటసాల మధుర గీతాలను ఆలపించారు. ఘనంగా అమర గాయకుడు ఘంటసాల జయంతి వేడుకలు


ఘంటసాలకు నివాళులర్పిస్తున్న సుబ్రహ్మణ్యం

రబీ పంటల బీమా నమోదు చేయండి : ఏవో

తోట్లవల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రబీ పంటలు సాగు చేస్తున్న రైతులు ఈ నెల 15లోపు తమ పంటలకు బీమా చేయించుకోవాలని వ్యవసాయాధికారి జి నాగేశ్వరరావు తెలిపారు. తోట్లవల్లూరు వ్యవసాయ కార్యాలయంలో బుధవారం గ్రామ వ్యవసాయ సహాయకులకు అవగాహన సమావేశం నిర్వహించారు. బీమా కింద ఎకరా మినుము పంటకు రూ. 80, వరి, మొక్కజొన్న పంటలకు ఎకరాకు రూ. 84, పెసరకు రూ. 36 రైతు వాటా కింద ప్రీమియం చెల్లించాల్సి ఉందని వివరించారు.

పామర్రు: మండలంలో రెండోపంట సాగుకు సిద్ధమవుతున్న రైతులందరూ సాగు చేసిన పంటలకు ఈనెల 15లోగా బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి వి.శివనాగరాణి అన్నారు. బుధవారం ఆమె కార్యాలయంలో మాట్లాడుతూ రబీపంటలపై పంట రుణం తీసుకున్న రైతులకు సంబంధిత బ్యాంకే బీమా చెల్లిస్తారన్నారు. పంట రుణం తీసుకోని రైతులు, కౌలుదారులు పంటబీమా సొంతగానే చెల్లించుకోవాలన్నారు. పంట నమోదు తప్పనిసరిగా (ఈక్రాప్) చేసుకోవాలని సూచించారు. వీఏఏలు దాస్, శేఖర్, అజేయ్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఏవో నాగేశ్వరరావు

జీతాలు చెల్లించండి మహాప్రభో ..

గుడివాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా జీతాలు లేకుండా పని చేస్తున్నామని, వెంటనే జీతాలు ఇప్పించాలని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సఫాయి కార్మికులు అధికారులను వేడుకుంటున్నారు. స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో కార్మికులు చేపట్టిన నిరసన బుధవారంతో రెండో రోజుకు చేరింది. ఏఐటీయూసీ నియోజకవర్గ గౌరవాధ్యక్షులు గూడపాటి ప్రకాష్‌బాబు, కార్యదర్శి చింతలూరి సత్యనారాయణలు కార్మికులకు మద్దతు తెలిపారు. నిరసనలో వడ్డాది రమణమ్మ, కనుమూరి విజయలక్ష్మీ, వేల్పుల ధనలక్ష్మీ, మాతంగి మేరిమ్మ, దొండపాటి పద్మావతి, కోటేశ్వరమ్మ, తెరేజమ్మ, మణిమ్మ తదితరులు పాల్గొన్నారు.


నిరసనలో పాల్గొన్న సఫాయి కార్మికులు

గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు

● జిల్లా కార్యదర్శి రవికుమార్

గుడివాడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటున్నామని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి వేములపల్లి రవికుమార్ అన్నారు. బుధవారం స్థానిక సాగులాబ్‌చంద్ ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక తనిఖీల్లో బాగంగా గ్రంథాలయానికి రావడం జరిగిందన్నారు. గ్రంథాలయ భవనం శిథిలావస్థలో ఉందని, త్వరలోనే నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీయిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బీరం వెంకటరమణ, సిబ్బంది టి.ప్రవల్లిక, పి.రవిచంద్ర, పాఠకులు పాల్గొన్నారు.


గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న రవికుమార్


విరిగిపడిన నేరేడు చెట్టు.. ఒకరికి గాయాలు

తోట్లవల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నేరేడు చెట్టు బుధవారం ఎలాంటి సుడిగాలి లేకుండానే ఆకస్మాత్తుగా విరిగిపడింది. ఈ చెట్టు కొమ్మలు కరెంటు లైన్‌పై పడటంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దాంతోపాటు పక్కనే ఉన్న సైకిల్ మెకానిక్ అబ్దుల్ రహీమ్‌పై పడటంతో స్వల్పగాయాలకు గురయ్యాడు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది రహీమ్‌కు చికిత్స అందించారు. ఆ తరువాత చెట్టును తొలగించి కరెంటును పునరుద్ధరించారు.


గాయపడిన అబ్దుల్ రహీమ్

9న వెంకటేశ్వరస్వామి దేవస్థాన హుండీ లెక్కింపు

గుడివాడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : స్థానిక పాటిమీద ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 9న హుండీ లెక్కింపు కార్యక్రమం దేవదాయ శాఖ గుడివాడ తనిఖీదారు నిర్వహించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి కేవీ గోపాలరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లెక్కింపులో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తులను ధరించి, ఆధార్ కార్డు నకలును కార్యాలయంలో సమర్పించాలని ఆయన కోరారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.620

నేటి నుంచి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు

ఘంటసాల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి 211వ కల్యాణ మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ధర్మకర్తలు గొర్రెపాటి వెంకటరామకృష్ణ, గొర్రెపాటి జగన్మోహనరావు, గొర్రెపాటి సురేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5న ఉదయం విఘ్నేశ్వరపూజతో మహోత్సవాల ప్రారంభం, 6న సాయంత్రం 6.15 గంటలకు జగాజ్యోతి, రాత్రి 8.09 గంటలకు స్వామి కల్యాణం, 7న షష్ఠి మహోత్సవం, 8న వసంతోత్సవంతో ముగుస్తాయని పేర్కొన్నారు. స్వామి కల్యాణ వేడుకల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.



బలరామునిపేటలో రోడ్డుప్రమాద మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

● మంత్రి కొల్లు రవీంద్ర హామీ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల కంకిపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చీలి భానుప్రకాష్, చింతా రవి, ప్రభు కుటుంబాలకు అండగా ఉంటామని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. బలరామునిపేటలో మృతుల కుటుంబాలను బుధవారం మంత్రి కొల్లు రవీంద్ర పరామర్శించారు. ఇటీవల మృతిచెందిన పండ్లవర్తక సంఘం గౌరవాధ్యక్షుడు శ్రవణం లక్ష్మీపతి, బందరు మండలం పల్లెతుమ్మలపాలేనికి చెందిన టీడీపీ నాయకుడు మునిస్వామి కుటుంబసభ్యులను మంత్రి పరామర్శించారు. కోనలో చంద్రమ్మ, వెంకటదుర్గాంబపురానికి చెందిన మునలయ్య, శారదానగర్‌కు చెందిన నక్షత్రమ్మ, సతీష్, కాలేఖాన్‌పేటకు చెందిన మున్నావాసు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు.

రూ.57.33 కోట్లతో వాటర్‌వర్క్స్

● డీపీఆర్ సిద్ధం..త్వరలో టెండర్లు పిలుస్తాం: కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలో తాగునీటి సరఫరా కోసం అభివృద్ధికి పనులకు అమృత్ ఫేజ్-2 పథకం కింద రూ.57 కోట్ల 33 లక్షలతో డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేశామని, త్వరలో టెండర్లు పిలుస్తామని మునిసిపల్ కమిషనర్ కె.బాపిరాజు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వాటాగా రూ.17 కోట్ల 80 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.13 కోట్ల 98 లక్షలు సమకూర్చిందన్నారు. 15వ ఫైనాన్స్ నిధులు రూ. 18 కోట్ల 14 లక్షలు రాబట్టేందుకు కృషి చేశామన్నారు. మచిలీపట్నంలోని బలహీన వర్గాల కాలనీలకు రూ.93 లక్షలు, నగర పాలక సంస్థలో తాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు రూ.13 కోట్ల 64 లక్షలు, తాగునీటిని శుద్ధి చేసే ప్రాజెక్టుకు రూ.కోటి, రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించేందుకు రూ.39 కోట్లు, చెరువుల అభివృద్ధికి రూ.2 కోట్ల 76 లక్షల డీపీఆర్ తయారు చేశామన్నారు. సబ్‌జైలు, ఫతుల్లాబాద్ వద్ద 2 ఎస్టీపీలు నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించామని కమిషనర్ తెలిపారు.

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌వి డైవర్షన్ పాలిటిక్స్

● మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు విమర్శ

అవనిగడ్డ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని సమస్యలపై మాట్లాడితే ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు విమర్శించారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ శ్రీహరిరావు హత్య కేసులో నిజానిజాలు నిగ్గుతేల్చి నిందితులెవ్వరో తేల్చాలని సింహాద్రి డిమాండ్ చేశారు. తాను నియోజకవర్గ సమస్యలపై ప్రస్తావించిన ప్రతీసారి ఇలాంటి పుకార్లు తెచ్చి సమస్యను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. మండలి బుద్ధప్రసాద్ కుమారుడికి ప్రభుత్వ కార్యక్రమాల్లో ఏం పని..ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఆయన చేయడం ఏంటి? అని సింహాద్రి నిలదీశారు. నియోజకవర్గంలోని సమస్యలను బుద్ధప్రసాద్ గాలికి వదిలేసి ఫొటోలకు పాలాభిషేకాలు చేయించుకోవటం తగదన్నారు. నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులను పరిష్కరించాలని, వైసీపీ హయాంలో మంజూరైన ఎదురుమొండి వారధిని వెంటనే పూర్తి చేయించాలని ఆయన డిమాండ్ చేశారు.



ముడా చైర్మన్ మట్టా ప్రసాద్‌కు అభినందనలు తెలుపుతున్న ఇంజనీర్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు

మర్యాదపూర్వక కలయిక

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముడా చైర్మన్ మట్టా ప్రసాద్‌ను బుధవారం లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముడాకు గతంలో వస్తున్న ఆదాయపు వనరులు కొనసాగేందుకు సహకరించాలని వారిని ముడా చైర్మన్ కోరారు. మట్టా ప్రసాద్‌ను కలిసిన వారిలో ఆర్.వి.ఎస్.మురళీకృష్ణ, కోస్తా మురళీకృష్ణ, జి.వి.సుబ్బారావు, వి.గోపాల్, ఈశ్వరప్రసాద్, మహేష్, సతీష్, అబ్దుల్ బారీ, నాంచారయ్య, లక్ష్మీనరసింహం ఉన్నారు.

న్యాయవాదుల సంక్షేమంపై దృష్టి సారించాలి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సంక్షేమంపై ఏపీ బార్ కౌన్సిల్ ప్రత్యేక దృష్టి సారించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్ కోరారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీ బార్ కౌన్సిల్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వల్ల న్యాయవాదులు తీవ్రంగా నష్టపోతారన్నారు. న్యాయవాదుల వెల్ఫేర్ ఫండ్‌ను సక్రమంగా వినియోగించాలన్నారు. వకాల్తాల్లో కొందరు న్యాయవాదుల పేర్లు లేవని, వాటిపై పునరాలోచించాలన్నారు. రూ.200 సీవోపీని రూ.500 చేశారని, కానీ సంక్షేమ కార్యక్రమాలకు ఆశించినంతగా వినియోగించడంలేదన్నారు. ప్రాక్టీసు మానేసిన న్యాయవాదులకు రూ.14వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. జూనియర్ న్యాయవాదులకు రూ.10వేలు ఇవ్వాలని, డెత్ బెనిఫిట్లు రూ.10 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు ఇవ్వాలన్నారు. న్యాయవాదుల సమస్యపై హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు.

నసీర్‌ఖాన్ కుటుంబానికి పరామర్శ

పెడన, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన పెడన మునిసిపల్ కో-ఆప్షన్ మాజీ సభ్యుడు నసీర్ ఖాన్ కుటుంబ సభ్యులను బుధవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ పరామర్శించారు. నసీర్‌ఖాన్ కుటుంబానికి అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. తర్వాత పట్టణంలోని కాపువీధిలో ఉంటున్న కూనపరెడ్డి సుబ్బారావును పరామర్శించారు. సుబ్బారావు ఇటీవల గుండెకు స్టంట్ వేయించుకున్నారు. వేదవ్యాస్ వెంట జయలక్ష్మి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వరుదు రామకృష్ణ, పైడమ్మతల్లి దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యుడు పత్తిపాటి జయకృష్ణ, ఊసా జనార్దనరావు తదితరులు ఉన్నారు.



పెడన కో-ఆప్షన్ మాజీ సభ్యుడు నసీర్‌ఖాన్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్

దళారులకు ధాన్యం విక్రయించొద్దు

» ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుంది

» రైతులకు మంత్రి నాదెండ్ల మనోహర్ భరోసా

చల్లపల్లి/ఘంటసాల/మోపిదేవి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'దళారులకు ధాన్యాన్ని విక్రయించుకోవద్దు. రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వివరాలు నమోదు చేసుకోండి. మద్దతు ధరను ఇచ్చి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుంది. 12 గంటల్లో ఖాతాల్లో నగదు జమ చేస్తుంది.' అని రైతులకు పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు. అవనిగడ్డ నియోజకవర్గంలో తుఫాను కారణంగా రైతులు పడుతున్న ఇబ్బందులు, ధాన్యం కొనుగోళ్లలో సమస్యలను తెలుసుకునేందుకు వచ్చిన ఆయనకు మాజేరు వద్ద ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జనసేన, టీడీపీ నేతలు స్వాగతం పలికారు. చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండలాల పరిధిలోని పాతమాజేరు, లంకపల్లి, లక్ష్మీపురం, మంగళాపురం అడ్డరోడ్డు, చల్లపల్లి-పెదకళ్లేపల్లి రోడ్డు, కాసానగర్, పెదప్రోలు ప్రాంతాల్లో హైవేపై దారి పొడవునా ఆరబెట్టిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. రైతులున్న ప్రతిచోటా వాహనం దిగి సమస్యలు తెలుసుకున్నారు. వర్షానికి ధాన్యం తడవడం, కొద్దిమేర మొలకెత్తటం, తేమశాతం ఎక్కువగా ఉండటంతో ఆరబెట్టుకుంటున్నామని, తేమశాతం ఎక్కువగా ఉండటంతో మిల్లర్లు ధాన్యం తీసుకోవడం లేదని, తీసుకున్నా తక్కువ ధర ఇస్తున్నారని రైతులు మంత్రికి తెలిపారు. 1262, 1224 రకం ధాన్యం కొనుగోలు చేయటంలేదని ఫిర్యాదు చేశారు. ప్రతి గింజా ప్రభుత్వ మద్దతు ధరకే కొనుగోలు చేస్తామని, దళారులను ప్రోత్సహించవద్దని, సమస్యలుంటే రైతుసేవా కేంద్రానికి వెళ్లాలని రైతులకు మంత్రి సూచించారు. ఆరబెట్టిన ధాన్యాన్ని సాయంత్రంలోగా కొనుగోలు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. తేమ 24శాతం వరకూ కొనుగోలు చేయాలని ఆదేశించామన్నారు. 1262 రకం కొనుగోలుపై ఇప్పటికే మాట్లాడామని, 1224 రకం కొనుగోలులోనూ ఇబ్బందులు లేకుండా చూస్తామని, రైతులు అధైర్యపడాల్సిన పనిలేదని ఆయన భరోసా ఇచ్చారు. మిల్లర్లు, అధికారులతో ఇబ్బందులుంటే ఆర్డీవో దృష్టికి తేవాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని 104 ఉద్యోగులు మంత్రికి వినతిపత్రం అందజేశారు.

డ్రయర్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి

రైతుల సంక్షేమం కోసం ఈ ప్రాంతంలో డ్రయర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. అన్ని రకాల ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పిస్తూ వెంటనే ఆన్‌లైన్ చేసి మిల్లులకు తరలించేలా చూడాలని ఆర్డీవో స్వాతికి మంత్రి సూచించారు.



పాతమాజేరులో రైతులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

మాజేరు వీఏఏ, టీఏలపై ఆగ్రహం

పాతమాజేరులో ఆరబెట్టిన ధాన్యం పరిశీలిస్తుండగా ఓ రైతు ధాన్యం విక్రయంలో ఇబ్బందులు మంత్రికి చెప్పారు. దీంతో రైతుసేవా కేంద్రానికి వెళ్లారా అని రైతును మంత్రి ప్రశ్నించారు. తాము వెళ్లలేదని, వారు తమను అడగటం లేదని రైతు చెప్పారు. దీంతో మంత్రి స్థానిక టీఏ, వీఏఏలను ప్రశ్నించారు. వరికోతల సమాచారం రైతులు ఇవ్వలేదని టీఏ చెప్పటంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీల్డ్‌లో ఎందుకు తిరగటం లేదని వీఏఏపైనా ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ-క్రాప్ జరిగినప్పుడు రైతు దగ్గరకు మీరెందుకు వెళ్లటంలేదని మందలించారు. ఇద్దరిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్డీవో స్వాతిని ఆదేశించారు. తమ తప్పేమీ లేదనీ.. రైతులు తమకు కనీస సమాచారం ఇవ్వలేదని, నేరుగా మిల్లర్లనే సంప్రదిస్తున్నారని వారు ఆర్డీవోకు విన్నవించారు.

రైతులకు గన్నీ బ్యాగులు అందించండి

ధాన్యం కొనుగోలులో సమస్యలను మంత్రి నాదెండ్ల మనోహర్‌కు లంకపల్లి గ్రామానికి చెందిన కొమ్మారెడ్డి లీలాకృష్ణ వివరించారు. స్పందించిన మంత్రి ఈ రోజు సాయంత్రానికల్లా ధాన్యాన్ని తరలించాలని, అవసరమైన గన్నీ బ్యాగులు రైతులకు అందించాలని ఆర్డీవో స్వాతిని ఆదేశించారు.

ఘంటసాల గానం అజరామరం

అవనిగడ్డ/ఘంటసాల/మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల వెంకటేశ్వరరావు గానం అమరాజమరమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఘంటసాల 102వ జయంతి వేడుకలు గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఘంటసాలలోని కళాతోరణంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఘంటసాల వెంకటేశ్వరరావు, నందమూరి తారకరామారావు విగ్రహాలకు జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకటరామకృష్ణ, బండి పరాత్పరరావు, డాక్టర్ వేమూరి ప్రమోద్ నివాళులర్పించారు. మచిలీపట్నంలో మునిసిపల్ ప్రధాన పార్కు పక్కన ఉన్న ఘంటసాల విగ్రహానికి టీడీపీ రాష్ట్ర నాయకుడు కొనకళ్ల బుల్లయ్య నివాళులర్పించారు. జి.రామబ్రహ్మం, పి.వి.ఫణికుమార్, శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.



అవనిగడ్డలో ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, బందరులో కొనకళ్ల బుల్లయ్య

ఏకాగ్రతతో చదివితే ర్యాంకులు సాధ్యమే

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు నూరురోజుల ప్రణాళికను పెట్టుకుని ఏకాగ్రతతో చదివితే ఆశించిన ర్యాంకులు సునాయాసంగా సాధించవచ్చని ప్రముఖ విద్యావేత్త, ఏపీ మాజీ సలహాదారుడు దిట్టకవి వెంకటేశ్వరరావు సూచించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రుస్తుంబాద బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ప్రతిభా పురస్కారాలు అందజేశారు. 8, 9, 10 తరగతుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎంఈవో దుర్గాప్రసాద్, ఎంఈవో-2 గురుప్రసాద్, స్టార్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆదిత్య, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వహణకు రూ.2 లక్షల విరాళం

ఘంటసాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం, బాలపార్వతీ సమేత జలదీశ్వరస్వామి దేవస్థానాల్లో ఉత్సవాల నిర్వహణ, ప్రసాదాలకు రూ.2 లక్షల విరాళాన్ని ట్రస్టీకి అందజేశారు. ఘంటసాల గ్రామానికి చెందిన దివంగత వేమూరి వెంకట్రామయ్య-నరసమ్మ కుమారుడు రామారావు జ్ఞాపకార్థం ఆయన సోదరి వేమూరి వెంకటరమణమ్మ పంపిన విరాళాన్ని దేవస్థానాల ట్రస్టీ గొర్రెపాటి వెంకట రామకృష్ణకు గొర్రెపాటి గోపాలకృష్ణ అందజేశారు.



బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు వ్యతిరేకంగా కోనేరు సెంటర్‌లో నిరసన తెలుపుతున్న హిందూ ఐక్యవేదిక ప్రతినిధులు

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు అమానుషం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు అమానుషమని హిందూ ఐక్యవేదిక ప్రతినిధులు పేర్కొన్నారు. దాడులకు వ్యతిరేకంగా హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. కోనేరు సెంటర్ నుంచి కలెక్టర్ ఆఫీసు వరకు నిర్వహించిన ఈ ప్రదర్శనలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు, బీజేపీ నాయకులు పంతం గజేంద్ర, ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు శ్రీకాంత్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

దార్శనికుడు రోశయ్య

● ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాలు

● ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నేతలు



అవనిగడ్డలో రోశయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, బందరులో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘాల నాయకులు

అవనిగడ్డ/పెడన/మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య గొప్ప దార్శనికుడని ఎమ్మెల్యే మండలి బుద్ధపసాద్ అన్నారు. బుధవారం పోలీస్ స్టేషన్ సమీపంలో రోశయ్య వర్ధంతి కార్యక్రమాన్ని మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. రోశయ్య, మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, మండలి వెంకట్రామ్ నివాళులర్పించారు. ఆర్యవైశ్య ప్రముఖులు ఘంటసాల రాజమోహనరావు(కన్నయ్య), నంబూరు వెంకటేశ్వరరావు, దేసు జగన్మోహనరావు పాల్గొన్నారు. పెడనలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రోశయ్య వర్ధంతిని వాసవీ ప్రార్థనా మందిరంలో నిర్వహించారు. రోశయ్య చిత్రపటానికి నేతలు నివాళులర్పించారు. ఆర్యవైశ్య పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు కొల్లూరి సత్యనారాయణ(చిన్నా), ఆత్మకూరి సురేష్, మామిడి ప్రసాద్ పాల్గొన్నారు. మచిలీపట్నంలో లక్ష్మీసోమయాజి ఆర్యవైశ్య సంఘ భవనంలో రోశయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. రోశయ్య చిత్రపటానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు తాడేపల్లి మెహర్‌బాబా కొత్తగుండు రమేష్, సామా లక్ష్మీకాంతం, ఉడత్తు శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

కోడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం అంకితభావంతో పని చేస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు అన్నారు. బుధవారం 9వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన కూటమి నాయకులతో కలసి శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించారు. వేములపల్లి రాజేష్, బొడ్డు వెంకన్న, బచ్చు వెంకటేష్ పాల్గొన్నారు.

7న గురుకులంలో సమావేశం

అవనిగడ్డ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పులిగడ్డ గురుకుల విద్యాలయంలో ఈ నెల 7వ తేదీన తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్‌టీపీ కుమార్ తెలిపారు. ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరుకావాలని కోరారు.

బాల్యం నుంచి నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాల్యం నుంచి నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సీఐ కె.వి.ఎస్.వరప్రసాద్ సూచించారు. బుధవారం చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్‌లో నాయకత్వ లక్షణాలు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో సీఐ మాట్లాడారు. సెల్‌ఫోన్ ఎక్కువగా వాడొద్దని, అధికంగా వాడితే అనేక అనర్థాలు కలుగుతాయని విద్యార్థులకు ఆయన వివరించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌కు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం యు.వి.కృష్ణమూర్తి, ఎస్ఐ బలరాం, ఏఎస్ ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలు

పకడ్బందీగా నిర్వహించాలి

● అధికారులతో ఆర్డీవో స్వాతి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు బందరు ఆర్డీవో కె.స్వాతి సూచించారు. టీడీడీ కల్యాణ మండపంలో బుధవారం నీటి సంఘాల ఎన్నిక అధికారులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. బందరు డివిజన్ పరిధిలోని 79 వాటర్ యూజర్స్ అసోసియేషన్ల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఒక్కో వాటర్ యూజర్స్ అసోసియేషన్ పరిధిలో 12 టెరిటోరియల్ నియోజకవర్గాలు ఉంటాయని తెలిపారు. 79 వాటర్ యూజర్స్ అసోసియేషన్ల పరిధిలో 948 టెరిటోరియల్ నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. మచిలీపట్నంలో 27, గూడూరులో 28, ఘంటసాలలో 29, చల్లపల్లిలో 30, కోడూరులో 31, నాగాయలంక 32, కమలాపురంలో 20, మల్లేశ్వరంలో 21, కృత్తివెన్నులో 22 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. వీటిల్లో డిస్ట్రిబ్యూటరీ ఎన్నికలకు రంగం సిద్ధం చేసుకోవాలన్నారు. కేఈ విజయవాడ డివిజన్ ఈఈ కొడాలి బాబు, తహసీల్దార్ రావు, డిప్యూటీ తహసీల్దారులు సత్యనారాయణ, కల్పన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శేఖర్, శ్యాం పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్

పాపారావుకు అభినందన

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన చిలకలపూడి పాపారావు అభినందన సభ ఈనెల 6వ తేదీన అవనిగడ్డ డిగ్రీ కళాశాలలో జరుగుతుందని, కార్యక్రమానికి హాజరు కావాలని రాధా-రంగా మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షుడు బుల్లెట్ ధర్మారావు మండలి సభ్యులకు పిలుపునిచ్చారు. బుధవారం చిలకలపూడి పాపారావును ఆయన నివాసంలో ధర్మారావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. మల్లాడి రాజేష్, తలారి నాగమల్లేశ్వరరావు, విన్నకోట సుబ్బారావు, బొమ్మిడి గణేష్, సూరిశెట్టి హరికృష్ణ, మోగంటి బాలాజీ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న 9 మంది అరెస్టు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట వద్ద పేకాట స్థావరంపై బుధవారం బుధవారం పోలీసులు దాడి చేశారు. తొమ్మిది మందిని అరెస్టు చేసి రూ.90,050 నగదు, ఏడు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆర్‌పేట సీఐ ఏసుబాబు తెలిపారు.

